# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 110 | హైదరాబాద్ | గురువారం 16-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

**గూగుల్‌తో పాటు అదీ ముఖ్యమే**
: మంగళగిరిలో నారా లోకేశ్




11లో

## 2040లో భారతీయ వ్యోమగామి
# చంద్రుడిపై అడుగు పెడతారు

ఇస్రో చీఫ్ నారాయణన్

- అంతరిక్ష రంగ అభివృద్ధికి అనేక ప్రాజెక్టులు చేపట్టినట్లు వెల్లడి
- 2026లో వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపిస్తామన్న ఇస్రో చీఫ్
- దేశంలో ఇప్పుడు 300 కంటే ఎక్కువ స్టార్టప్‌లు పని చేస్తున్నాయన్న ఇస్రో చీఫ్

## పండగ ఆఫర్లతో
# సైబర్ వల..

- పండగ సీజన్‌లో పెరిగిన సైబర్ మోసాలపై హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక
- నకిలీ వెబ్‌సైట్లు, ఏపీకే ఫైల్స్‌తో ఆన్‌లైన్ షాపర్లే లక్ష్యంగా మోసాలు
- గిఫ్ట్ ఆఫర్ నమ్మి రూ.1.40 లక్షలు నష్టపోయిన సికింద్రాబాద్ మహిళ
- ఫేక్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి వృద్ధుడు రూ.1.02 లక్షలు పోగొట్టుకున్న వైనం



11లో

# నేటి భారతం

- శుభ్రతే శివతనం..
  స్వచ్ఛ హైదరాబాద్ మన అందరి కర్తవ్యం..
- స్వచ్ఛ నగరమే సుందర నగరం.. చెత్త రహిత హైదరాబాద్ నిర్మించడం మన చేతుల్లోనే ఉంది.
- చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయడం కాదు.. చెత్తను ఎక్కడ వేయాలో తెలిసే మనసు కావాలి..
- ప్రతి ఇల్లు శుభ్రంగా ఉంటేనే నగరం శుభ్రంగా ఉంటుంది.
- స్వచ్ఛత ఒక అలవాటు కాదు,
  అది మన సంస్కారం కావాలి.
- స్వచ్ఛ హైదరాబాద్ అంటే కేవలం ప్రభుత్వం కాదు.. ప్రతి పౌరుడి భాగస్వామ్యం..
- ఒక చీపురుతో కాదు, ఒక చైతన్యంతో శుభ్రత సాధ్యమవుతుంది..
- పారిశుద్ధ్యమే పరిపూర్ణతకు నాంది.. స్వచ్ఛ నగరం అంటే కేవలం రోడ్లు శుభ్రం కాదు..
- మన ఆలోచనలూ శుభ్రంగా ఉండాలి..
- తమ ఇంటి ముందు చెత్త వేయని ప్రతి వ్యక్తీ.. హైదరాబాద్‌ను మరింత అందంగా చేస్తున్నాడు.
- ముఖ్యంగా చెత్తను తొలగించటం కంటే.. చెత్త సృష్టించకుండా ఉండటమే గొప్ప స్వచ్ఛత..

– ఇంద్రపల్లి. గోవర్ధన్

## కేసీఆర్ ఫొటో లేకుండానే..
### 33 జిల్లాల యాత్రకు కవిత



11లో

- తెలంగాణ వ్యాప్తంగా జిల్లాల యాత్రకు కవిత శ్రీకారం
- దీపావళి తర్వాత 33 జిల్లాల్లో పర్యటనకు ప్లాన్
- ప్రొఫెసర్ జయశంకర్ ఫొటోతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం



12లో

## పబ్లిక్ టాయిలెట్స్ ని కూడా వదలని
# జిహెచ్ఎంసి అవినీతి కంపు

హైదరాబాద్ మహానగరానికి ప్రతీ రోజు అన్ని ప్రాంతాల నుంచి ఎంతో మంది వస్తుంటారు.. అందరికీ ఇక్కడ వసతి ఉండకపోవచ్చు.. అందుకే పబ్లిక్ టాయిలెట్స్ పై ఆధారపడతారు.. ప్రొద్దుటే ఇక్కడ ఫ్రెష్ అయ్యి, పని చూసుకుని సాయంత్రానికి తిరిగి వెళ్తుంటారు.. అదే కాకుండా హైదరాబాద్ మహానగరంలో ఒక గూడు లేకుండా ఫుట్ పాత్ లపై జీవించేవారు వేల సంఖ్యలో ఉన్నారు.. వారందరికీ పబ్లిక్ టాయిలెట్స్ ఆసరా అవుతాయి.. ఎంతో ముఖ్యమైన భూమిక పోషించే ఈ పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణంలో భారీ అవినీతి చోటుచేసుకుంది..ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యంతో ఒక లక్ష్యంతో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ అలక్ష్యానికి గురైపోయాయి.. కొన్ని చోట్ల టాయిలెట్స్ నిర్మించారు.. కానీ వాటి నిర్వహణ గాలికి ఒదిలేశారు..నిర్వహణ నిమిత్తం ప్రతి రోజూ కొన్ని వేల రూపాయలు ఖర్చు కింద చూపిస్తున్నారు.. మరి ఆ నిధులు ఏమైపోయాయో అర్థం కాదు.. మరికొన్ని చోట్ల నిర్మించినట్లు రికార్డుల్లో ఉన్నా.. అక్కడ నిర్మాణాలు లేవు..మరి ఈ పైకం అంతా ఎవరి జేబుల్లోకి వెళ్ళింది..? ఒక్కటి కాదు రెండు కాదు లక్షల రూపాయల అవినీతి నాయకుల బొక్కసంలోకి వెళ్లినట్లు స్పష్టంగా అర్థం అవుతోంది.. చివరికి కాల కృత్యాలు తీర్చుకునే టాయిలెట్స్ లో కూడా అవినీతి చోటుచేసుకుందంటే.. ఈ సోకాల్డ్ లీడర్లు రోజూ తినేది అన్నమేనా లేక అసహ్యమా..? అన్న అనుమానం కలుగక మానదు..

## నామినేషన్ వేసిన మాగంటి సునీత
### వెంట కేటీఆర్, ముఖ్యనేతలు




11లో

- జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత నామినేషన్
- దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో అనివార్యమైన ఉపఎన్నిక
- సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నం

## ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దాం



11లో

- రేపు ఏపీలో ప్రధాని మోదీ పర్యటన
- శ్రీశైలం, కర్నూలులో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న ప్రధాని
- పర్యటనను విజయవంతం చేయాలని నేతలకు సీఎం చంద్రబాబు పిలుపు
- గూగుల్ రాక వెనుక ప్రధాని, కేంద్ర మంత్రుల చొరవ ఉందన్న ముఖ్యమంత్రి




2016లో బోటిక్ నిర్వహించిన అరుణ తాటి పర్తి



10లో

## తడి గుడ్డతో గొంతు కోస్తున్న కిలాడి రాణి
# అరుణ కుమారి తాడిపత్రి

### ఈవిడ ధనదాహానికి బలైపోయిన అమాయకులు..

- అధిక లాభాలు ఇస్తామంటూ అడ్డంగా దోచేస్తున్న కిరాతక స్త్రీ..
- మహానగరంలో మహా మోసగత్తె..
- రియల్ ఎస్టేట్ కంపెనీ అంటూ నిలువునా మోసం..
- ఒక్క గుంట భూమి లేదు.. కానీ వెంచర్స్ వేస్తున్నామని అభూత కల్పనలు..
- హోటల్స్, అపార్ట్మెంట్స్, మొబైల్ హోమ్ సైట్స్ అంటూ బిల్డప్..
- మరో లోకంలో తీసుకెళ్ళే ఈవెంట్స్ నిర్వహిస్తూ కనికట్టు చేస్తూ..
- కోట్లలో కొల్లగొట్టి ఇప్పుడు చేతులు ఎత్తేసిన మోసగత్తె..
- పేరున్న సినీ, టీవీ ఆర్టిస్టులతో, సింగర్స్ తో కలర్ ఫుల్ ప్రోగ్రామ్స్..
- అమాయకులను, పెట్టుబడిదారులను ఆకర్షించడమే ధ్యేయం..
- అధిక కమీషన్ల పేరుతో ఏజెంట్ల నియామకం..
- 2 నుంచి 4 శాతం వడ్డీ ఇస్తామని నమ్మబలికి గొంతు కోసిన వైనం..
- ల్యాండ్ ను సెక్యూరిటీగా ఇస్తానంటూ ఆశ పెడుతుంది..
- పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన బహుమతులు ఇస్తుంది..
- వచ్చిన డబ్బులతో ఇన్వెస్ట్ చేస్తున్నామని మోసపూరిత వాగ్దానాలు చేసింది..
- పుస్తెలు సైతం అమ్మి పెట్టుబడులు పెట్టి మునిగిపోయిన అమాయకులు..

భారత శక్తి

## ఆరెస్సెస్ చుట్టూ కర్ణాటక రాజకీయాలు

ఒకవైపు ప్రియాంక్ ఖర్గే.. ఇంకోవైపు యతీంద్ర సిద్ధరామయ్య.. ఇద్దరు కాంగ్రెస్ యువ నేతలు ఆల్ ఆఫ్ సడెన్ గా ఆరెస్సెస్ పై విరుచుకుపడడం కర్ణాటక రాజకీయాల్లో హాట్ టాపిక్ అయింది. ఒకరు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొడుకు. ప్రస్తుతం కర్ణాటక ప్రభుత్వంలో మంత్రి. మరొకరు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కొడుకు. ఎమ్మెల్సీగా ఉన్నారు. ఒకరు ఆరెస్సెస్ ను బ్యాన్ చేయాలి.. పబ్లిక్ ఈవెంట్లకు ఎలాంటి పర్మిషన్లు ఇవ్వొద్దంటే.. మరొకరు.. ఆరెస్సెస్, తాలిబాన్ మైండ్ సెట్ ఒకటే అని, హిందూయిజాన్నే మొత్తం తీసుకురావాలనుకుంటోందన్నారు. దీంతో ఒక్కసారిగా అలజడి పెరిగింది. ఉన్నట్లుండి ఈ ఇద్దరూ ఆరెస్సెస్ ను టార్గెట్ చేసుకోవడం వెనుక ఏం జరుగుతోందన్నది కీ ఫ్యాక్టర్ గా మారింది. అసలు కర్ణాటకలో ఆరెస్సెస్ ఉండొద్దు.. ఆ పదమే వినిపించొద్దు.. యూత్ మైండ్ సెట్ పాడు చేస్తున్నారు.. రాజ్యాంగ వ్యతిరేక పనులు చేస్తున్నారంటూ ప్రియాంక్ ఖర్గే కౌంటర్ ఇచ్చారు. సంఘ్ పై విమర్శల వరకు అయితే వివాదం ఉండేది కాదు. ప్రభుత్వ స్థలాల్లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకలాపాలను నిషేధించాలని కోరుతూ కర్ణాటక ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే సీఎం సిద్ధరామయ్యకు లేఖ రాసిన తర్వాత కర్ణాటకలో రాజకీయ వివాదం చెలరేగింది. కర్ణాటక కాంగ్రెస్ లో సంఘ్ వ్యతిరేక రాగాలు. లేఖలో ఏముందంటే.. ప్రభుత్వ పాఠశాలలు, ఆట స్థలాలు దేవాలయాలలో సంఘ్ శాఖలు, సమావేశాలను నిర్వహించడం ద్వారా పిల్లలు, యువతలో విభజన ఆలోచనలను ఆర్ఎస్ఎస్ వ్యాపింపజేస్తోందని ఆరోపించారు. అలాంటి కార్యక్రమాలు రాజ్యాంగ విరుద్ధమని, జాతీయ ఐక్యతా స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. వాటిని పూర్తిగా బ్యాన్ చేయాలని స్వరం పెంచుతున్నారు. పోలీసుల అనుమతి లేకుండా జరిగే సంఘ్ శాఖల్లో దండ ఉపయోగిస్తారని, కర్రసాములు ఉంటాయని, పిల్లలు, యువతపై చెడు ప్రభావాన్ని చూపుతాయన్నారు ప్రియాంక్ ఖర్గే. అందుకే ప్రభుత్వ గ్రౌండ్లలో, బైఠక్ అనో, సాంఘిక్ అనో ఏ సమావేశం పెట్టినా ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను నిషేధించాలన్నారు. ఆ దిశగానే కర్ణాటకలో కథ ముందుకెళ్లింది. సర్కార్ కూడా సంఘ్ కార్యకలాపాలపై అడుగు ముందుకేస్తోంది. కర్ణాటక కాంగ్రెస్ నేతల్లో సంఘ్ వ్యతిరేక స్వరాలు. ప్రియాంక్ ఖర్గే అక్కడితో ఆగలేదు. ఆర్ఎస్ఎస్ ప్రతిపాదించిన ఫండమెంటలిస్టిక్ భావజాలం కారణంగా భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ పై షూ విసిరే వాతావరణం ఏర్పడిందన్నారు. రాజ్యాంగం ఆదర్శాలను ? ఐక్యత, సమానత్వం సమగ్రతను ? నిలబెట్టే లక్ష్యంతో పని చేసుకువెళ్దామని, అలాంటి ప్రయత్నాలను నిరోధించే లక్ష్యంతో పని చేసే వ్యక్తులను సంస్థలను అడ్డుకోవాలన్న స్వరాలు కర్ణాటక కాంగ్రెస్ లో పెరుగుతున్నాయి. అయితే కర్ణాటకలో ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలను ప్రైవేట్‌గా నిర్వహించుకోవచ్చని, ప్రభుత్వ సంబంధిత స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో మాత్రం అనుమతించొద్దంటున్నారు. సంఘ్ ను తాలిబాన్లతో పోల్చిన యతీంద్ర. అటు మల్లికార్జున ఖర్గే కుమారుడు అలా లేఖ రాయగానే.. ఇలా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు, కాంగ్రెస్ నాయకుడు యతీంద్ర సిద్ధరామయ్య రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను తాలిబన్లతో పోల్చడం పెను దుమారానికి కారణమైంది. తాలిబన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకి భారత పర్యటన సందర్భంగా యతీంద్ర ఈ కామెంట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. మరో కాంగ్రెస్ నాయకుడు బికె హరిప్రసాద్ కూడా ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలపై ఆంక్షలు విధించాలని డిమాండ్ చేశారు. సో కర్ణాటక కాంగ్రెస్ లో ఇప్పుడు ఆరెస్సెస్ వ్యతిరేక స్లోగన్స్ పెరుగుతున్నాయి. కోరస్ పెరుగుతోంది. ఉన్నట్లుండి ఎందుకిలా? సంఘ్ గురించి ఏం తెలుసు అని బీజేపీ కౌంటర్. సంఘ్ పై కాంగ్రెస్ నేతలు ఇంతలా ఫైర్ అవుతుంటే.. బీజేపీ ఊరుకుంటుందా.. గట్టిగానే కౌంటర్లు ఇస్తోంది. ఆర్ఎస్ఎస్ నేపథ్యం, ఆ సంస్థ నిర్వహిస్తున్న కార్యకలాపాలు తెలియని వారు మాత్రమే ఇలాంటి కామెంట్లు చేస్తారని కర్ణాటక బిజెపి అధ్యక్షుడు బి.వై. విజయేంద్ర కౌంటర్ ఇచ్చారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ప్రియాంక్ ఖర్గే రాసిన లేఖ ఆయన మూర్ఖత్వాన్ని ప్రదర్శిస్తుందన్నారు. కాంగ్రెస్ రెండు మూడు సార్లు ఆర్ఎస్ఎస్‌ను నిషేధించిందని, కానీ తర్వాత ఆ నిషేధాలను ఉపసంహరించుకుందని విజయేంద్ర అన్నారు. మరి తప్పు లేకపోతే బ్యాన్ ఎందుకు ఎత్తేస్తారని క్వశ్చన్ చేశారు. ఆరెస్సెస్ వ్యతిరేక కామెంట్లు అన్నీ పదవులు కాపాడుకునేందుకు, గాంధీ కుటుంబాన్ని సంతృప్తి పరచడమే లక్ష్యంగా ఉన్నాయంటోంది బీజేపీ. సంఘ్ సేవను ఖర్గే అభినందించారన్న కర్ణాటక బీజేపీ. ఈ డైలాగ్ వార్ సందర్భంగా కర్ణాటక బిజెపి మల్లికార్జున ఖర్గేకు సంబంధించి ఓ ఫోటో షేర్ చేసింది. ఈ ఫోటో 2002 నాటిది. ఇందులో మల్లికార్జున ఖర్గే ఉన్నారు. బెంగళూరులోని నాగవారాలో జరిగిన ఆర్ఎస్ఎస్ కార్యక్రమానికి మల్లికార్జున్ ఖర్గే హాజరైన ఈ పాత ఫోటోను షేర్ చేసింది బీజేపీ. 2002లో కర్ణాటక హోం మంత్రిగా ఉన్నప్పుడు వెళ్లిన సీన్ ను ఎగ్జాంపుల్ గా చూపింది. మీ నాన్న స్వయంగా క్యాంప్ ను సందర్శించి, సామాజిక సేవా కార్యకలాపాలను అభినందించి, పూర్తి సహకారాన్ని అందిస్తే.. ఇవాళ మీరు కాంగ్రెస్ హైకమాండ్‌ను ఆకర్షించేందుకు షో చేస్తున్నారా అని ప్రియాంక్ ఖర్గేను ఉద్దేశించి కామెంట్ పెట్టింది. ప్రజలను హెచ్చరించడానికే తన తండ్రి వెళ్లాడన్న ప్రియాంక్. అయితే ఈ పోస్ట్ పై ప్రియాంక్ ఖర్గే రియాక్ట్ అయ్యారు. బిజెపి వాదన తప్పుడు ప్రచారం అని కొట్టిపారేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా ప్రజలను హెచ్చరించడానికే తన తండ్రి అప్పటి పోలీస్ కమిషనర్ సాంగ్లియానాతో కలిసి ఆరెస్సెస్ క్యాంప్ సైట్ దగ్గరికి వెళ్లారని పోస్ట్ పెట్టారు.

# దిశా, దశ మార్చే నవంబర్ నెల

విశాఖపట్టణం, అక్టోబరు 15,

నవంబర్ నెల.. ఏపీకి అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది. ఆంధ్రప్రదేశ్ దశ, దిశ మార్చేలా నవంబర్ నెలలో అడుగులు పడనున్నాయి. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్న సంగతి తెలిసిందే. అయితే అన్నింటికంటే ముందుగా టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటు కోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. విశాఖలో టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. నవంబర్ నెలలో విశాఖ వేదికగా టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. అలాగే కాగ్నిజెంట్ కూడా క్యాంపస్ ఏర్పాటు చేస్తోంది.

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగ అభివృద్ధిలో నవంబర్ నెల కీలకంగా మారనుంది. నవ్యాంధ్రకు పెట్టుబడులను ఆకర్షించేందుకు ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. దీంతో దిగ్గజ సంస్థల చూపు ఏపీ వైపు మళ్లుతోంది. ఈ క్రమంలోనే ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థలు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. అందులో కొన్ని ప్రాజెక్టులు వేగంగా అడుగులు పడుతున్నాయి కూడా. అయితే నవంబర్ నెల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దశ, దిశను మార్చేలా కనిపిస్తోంది. రెండు కీలక ప్రాజెక్టులకు నవంబర్ నెలలో శ్రీకారం చుట్టనున్నారు. విశాఖపట్నంలో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు అన్నింటికంటే ము?ందుగా ఆసక్తి చూపించింది టీసీఎస్.. ఆ తర్వాతనే ఒక్కొక్క కంపెనీ ఏపీవైపు, అందులోనూ విశాఖవైపు దృష్టి సారిస్తూ వచ్చాయి. ఈ క్రమంలోనే నవంబర్ నెలలో టీసీఎస్ తన కార్యకలాపాలు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. విశాఖపట్నంలో టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతో తొలుత ఒప్పందం చేసుకున్నది కూడా టీసీఎస్ కావటం విశేషం. ఇక టీసీఎస్ కోసం రుషికొండ సమీపంలోని ఐటీహిల్స్‌పై భవనాన్ని కూడా ఏపీ ప్రభుత్వం కేటాయించింది. హిల్-3లోని మిలీనియం టవర్స్ లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఈ భవనంలో ఉద్యోగులు పనిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ ఏర్పాట్లు కూడా తుది దశకు చేరుకున్నాయి. నవంబర్ నెలలో విశాఖ వేదికగా టీసీఎస్ కార్యకలాపాలు మొదలుపెట్టనుంది. ఈ విషయాన్ని ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కూడా తెలిపారు. టీసీఎస్ క్యాంపస్‌లో తొలిదశలో 2 షిప్టులలో 2000 మంది ఉద్యోగులు పనిచేస్తారు. ఆ తర్వాత ఉద్యోగుల సంఖ్యను క్రమంగా ఆరు వేలకు పెంచాలనే ఆలోచనలో ఉన్నారు. అందుకు తగ్గట్లుగా మిలీనయం టవర్స్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ఈ భవనం నుంచి తాత్కాలికంగా కార్యకలాపాలు సాగిస్తూనే.. టీసీఎస్ శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. రూ.1,370 కోట్లతో 12000 మందికి ఉపాధి కల్పించనుంది. టీసీఎస్ క్యాంపస్ కోసం ఏపీ ప్రభుత్వం ఐటీహిల్-3పై 22 ఎకరాలను కేటాయించింది. ఎకరా 99 పైసలకు చొప్పున కేటాయింపులు చేశారు. మరోవైపు టీసీఎస్ బాటలోనే మరో ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ కూడా విశాఖలో పెట్టుబడులు పెట్టనుంది. రూ.1,582 కోట్లతో విశాఖలో కాగ్నిజెంట్ క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతోంది. కాగ్నిజెంట్ క్యాంపస్ ద్వారా సుమారుగా 8000 మందికి ఉద్యోగాలు రానున్నాయి.. ఈ నేపథ్యంలో కాగ్నిజెంట్ సంస్థకు కూడా ఎకరా భూమి 99 పైసలకు కేటాయించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాపులుప్పాడ వద్ద 21.31 ఎకరాల భూమి కేటాయించింది. మరోవైపు కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ సీఈవో రవి కుమార్ వచ్చే నవంబర్‌లోనే విశాఖపట్నం పర్యటించనున్నారు. ఈ పర్యటనలోనే ఆయన విశాఖ కాగ్నిజెంట్ క్యాంపస్ ప్రారంభంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇవి కాకుండా గూగుల్ డేటా సెంటర్.. రూ.లక్ష కోట్లతో టీసీఎస్ డేటా సెంటర్ ఏర్పాటు కానున్నాయి.

# లిక్కర్ స్కామ్ వైసీపీ వైపు టర్న్ అవుతుందా?

విజయవాడ, అక్టోబరు 15,

ఆంధ్రప్రదేశ్ లో కల్తీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది. జోగి రమేష్ ఈ కేసులో ప్రధాన కారకుడుగా ఏ1 నిందితుడు జనార్ధన్ రావు చేసిన ఆరోపణలు ఇప్పుడు ఫ్యాన్ పార్టీని షేక్ చేస్తున్నాయి. తాను వైసీపీ హయాంలోనే నకిలీ మద్యాన్ని తయారు చేశానని జనార్ధన్ రావు ఎక్సైజ్ విచారణలో తెలిపారు. అలాగే టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తాను ఆ కార్యక్రమాన్ని మానేశానని చెప్పుకొచ్చారు. అయితే జోగి రమేష్ ఫోన్ చేసి టీడీపీ ప్రభుత్వాన్ని రాజకీయంగా ఇరకాటంలో పెట్టేందుకు తిరిగి నకిలీ మద్యం తయారు చేయాలని చెప్పడంతోనే తాను తిరిగి ఈ పనికి పూనుకున్నానని నిందితుడు జనార్ధన్ రావు చెప్పడం వైసీపీని ఇబ్బందుల్లోకి నెట్టేలా కనిపిస్తుంది. ములకలచెరువు మద్యం కల్తీ మద్యం కేసులో జనార్ధన్ రావు సంచలన విషయాలు వెల్లడించారు. జనార్ధన్ రావు వీడియో ఒకటి బయటకు రావడంతో సంచలనంగా మారింది. మాజీ మంత్రి జోగి రమేష్ ప్రోద్బలంతోనే తాను నకిలీ మద్యం తయారు చేశానని, టీడీపీ అధికారంలోకి రాగానే ఆపానని జనార్ధన్ రావు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. తనకు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జోగి రమేష్ ఫోన్ చేసి నకిలీ మద్యాన్ని తయారు చేయాలని కోరినట్లు జనార్ధన్ ఎక్సైజ్ అధికారుల విచారణలో తెలిపినట్లు ఆ వీడియోలో జనార్ధన్ రావు చెప్పడాన్ని బట్టి చూస్తే జోగి రమేష్ చుట్టూ కల్తీ మద్యం ఉచ్చు ఆయన చుట్టూ బిగుసుకుంటుందని చెప్పొచ్చు. మరొకవైపు జనార్ధన్ రావు ఫోన్ పోయిందని చెప్పినా సిమ్ ను యాక్టివ్ చేసే పనిలో ఎక్సైజ్ అధికారులున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నకిలీ మద్యం కేసులో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మొన్ననే జోగి రమేష్ అన్నారు. కొందరిని ఇరికించే కుట్ర చేస్తున్నారని ఆయన అన్నారు. దానికి తగినట్లుగానే జనార్ధన్ రావు కూడా జోగి రమేష్ పేరు చెప్పడంతో ఆయనను విచారించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. జోగి రమేష్ ను ఎప్పుడైనా అదుపులోకి తీసుకోవచ్చున్న ప్రచారం జరుగుతుంది. 2021లోనే విజయవాడకు సమీపంలోని ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారు చేశానని జనార్ధన్ ఒప్పుకోవడం, జోగి రమేష్ ప్రమేయం ఉందని చెప్పడంతో నకిలీ మద్యం కేసు వైసీపీ వైపు టర్న్ అయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తుంది. వైసీపీ నేతలు మాత్రం జనార్ధన్ రావు వీడియో చూస్తుంటే కుర్చీలో కూర్చోబెట్టి కావాలని చెప్పించినట్లు కనపడుతుందని అంటున్నారు. తమపై బురదను కడుక్కోలేక వైసీపీపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

చాట్ లీక్... కలకలం

ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ మద్యం కేసు మరో సంచలన ఘట్టానికి చేరుకుంది. ఈ కేసులో ఏ1 నిందితుడు జనార్దన్ రావు , మాజీ మంత్రి జోగి రమేష్ మధ్య జరిగిన వాట్సాప్ చాట్ లీక్ అవ్వడంతో ఈ వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. ఈ చాట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, రాజకీయ వర్గాల్లో పెను కలకలం సృష్టిస్తోంది.

-చాట్‌లో వెల్లడైన సంచలన విషయాలు

వాట్సాప్ చాట్ ప్రకారం.. వైసీపీ పాలనలో జోగి రమేష్



ఆధ్వర్యంలోనే నకిలీ మద్యం తయారీకి పాల్పడినట్లు నిందితుడు జనార్దన్ రావు అంగీకరించాడు. ఈ చాట్‌లో బయటపడిన కీలక అంశాలు ఇవీ. వ్యాపారం ఆపమని ఆదేశం: టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, జోగి రమేష్ ఆదేశాల మేరకే నకిలీ మద్యం వ్యాపారం ఆపేశామని జనార్దన్ రావు వెల్లడించారు. తిరిగి ప్రారంభించమని ఆదేశం: ఏప్రిల్ 2025లో జోగి రమేష్ ఫోన్ చేసి, "టిడిపి ప్రభుత్వంపై చెడ్డపేరు తెచ్చేలా మళ్లీ తయారీ మొదలు పెట్టు" అని చెప్పినట్లు చాట్‌లో స్పష్టంగా ఉంది. తంబళ్లపల్లి నియోజకవర్గంలో సూచన: అక్కడి నుంచి మొదలుపెడితే చంద్రబాబు ప్రభుత్వంపై బురద జల్లవచ్చు అని జోగి రమేష్ సూచించినట్టు వివరించారు. వేర్వేరు పేర్లతో గదులు అద్దెకు తీసుకుని, మద్యం తయారీకి యంత్రాలు ఏర్పాటు చేశారు. దీని తర్వాత సాక్షి మీడియా ముందు ఉంచి లీక్ ఇచ్చి రైడ్ చేయించడం, తద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే ప్లాన్‌ను ఈ చాట్‌లో స్పష్టంగా వెల్లడించారు. జనార్దన్ రావు ఫిర్యాదు ప్రకారం, జోగి రమేష్ చిన్నప్పటి పరిచయాన్ని అడ్డుపెట్టుకుని నమ్మించి మోసం చేశాడని పేర్కొన్నాడు. అలాగే, ఈ వ్యవహారంలో జై చంద్రారెడ్డికి అసలు సంబంధం లేదని స్పష్టం చేశాడు.

1జోగి రమేష్ స్పందన..

ఈ వ్యవహారంపై జోగి రమేష్ మొదట స్పందిస్తూ, జనార్దన్ రావు ఎవరో తనకు తెలియదని, తనపై కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఆ తర్వాత, పరిచయం ఉన్నప్పటికీ స్నేహితుడేమీ కాదని, జనార్దన్ తన ఇంటికి రాలేదని, సంబంధం లేని విషయాలను వెల్లడించాడని తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేయడానికి ఏలూరు రేంజ్ ఐజీ నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయబడింది. సిట్ అధికారులు ఇప్పటికే సీసీ ఫుటేజీలను సేకరించినట్లు సమాచారం. జోగి రమేష్‌పై ఆరోపణలు, అసలు కుట్రదారులు ఎవరు అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

– రాజకీయ పరిణామాలు, ప్రభుత్వం స్పందన

మాజీ మంత్రి జోగి రమేష్ పేరు తెరపైకి రావడం, ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి కుట్ర జరిగిందన్న ఆరోపణలు రాజకీయ వర్గాల్లో పెద్ద సంచలనం సృష్టించాయి. ప్రభుత్వం ఈ వ్యవహారంపై కఠినంగా ఉండాలని, ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉన్నా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. నకిలీ మద్యం కేసు రాజకీయంగా పెను దుమారం రేపనుంది. జనార్దన్ రావు?జోగి రమేష్ చాట్ లీక్, ఇతర సాక్ష్యాలు సిట్ దర్యాప్తుకు మార్గం చూపుతున్నాయి. ఈ కేసులో వచ్చే రోజుల్లో రాజకీయ పరిణామాలు, అధికారుల చర్యలు రాష్ట్రంలో ప్రధాన అంశాలుగా మారనున్నాయి.

## ఆల్ ఈజ్ వెల్ కాదే...

విజయవాడ, అక్టోబరు 15,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదే పదే తాను 1995 ముఖ్యమంత్రిని అని ప్రకటించుకుంటున్నారు. అయితే టీడీపీ కార్యకర్తలు మాత్రం మళ్లీ తమ కథ మొదటికే వచ్చిందని సోషల్ మీడియాలో బాధను వెళ్లగక్కుతున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ కార్యకర్తలకు మాత్రం న్యాయం జరగడం లేదని వారు బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. తమకు పదవుల విషయంలోనూ, ఇతర పనుల అంశంలోనూ అన్యాయం జరుగుతుందని తెలుగు తమ్ముళ్లు ఆక్రోశిస్తున్నారు. ఎమ్మెల్యేలు తమకు లాభం వచ్చిన వారికే అన్ని రకాలుగా ప్రయోజనాలు అందిస్తున్నారని, గత ఐదేళ్లు జెండా పట్టుకుని వైసీపీ ప్రభుత్వంలో తెగించి పోరాటం చేసినా అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పట్టించుకోవడం లేదంటున్నారు. . అనేక మంది తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియాలో ఇదే రకమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.




అప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ లు జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు ఖచ్చితంగా అక్కడ నేతలు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. కానీ తమ అభిప్రాయాలను చెప్పుకునేందుకు అవసరమై సమయాన్ని ఇవ్వకపోవడంతో తాము నిజాలు వెల్లడించలేకపోతున్నామని కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు.

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తలను ప్రాణంలా చూసుకుంటానని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పార్టీ నాయకత్వం మర్చిపోయిందని కొందరు తెలుగు తమ్ముళ్లు సూటిగా పార్టీ సోషల్ మీడియా వేదిక ద్వారానే ప్రశ్నిస్తున్నారు. . ఇటీవల కాలంలో ప్రభుత్వం అనేక అంశాల విషయంలో వివాదాలు ఎదుర్కొన్నప్పటికీ టీడీపీ సోషల్ మీడియా యాక్టివ్ గా లేకపోవడం అందుకు నిదర్శనమని చెబుతున్నారు. మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో చేసిన ప్రకటన విషయంలో గాని, ములకలచెరువు కల్తీ మద్యం కేసులో టీడీపీ కార్యకర్తల నుంచి పార్టీకి అండగా స్పందన లేకపోవడాన్ని గుర్తించాలంటున్నారు.

ఇప్పటికీ చంద్రబాబు నాయుడు గతంలో మాదిరిగా అధికారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని ఆల్ ఈజ్ వెల్ అనుకుంటే వచ్చే ఎన్నికల్లో ఇబ్బందులు పడతామని, గ్రౌండ్ లెవెల్ రియాలిటీని తెలుసుకోవాలనుకుంటే కార్యకర్తల మనోభిప్రాయాన్ని తెలుసుకోవాలని వారు సూచిస్తున్నారు. మరి పార్టీ నాయకత్వం క్యాడర్ గోడు పట్టించుకుంటుందా? లేదా? అన్నది చూడాలి.

# ఎమ్మెల్సీలు సేఫ్...

విశాఖపట్టణం, అక్టోబరు 15, (

వైసీపీ అధికారంలో ఉండగా ఎమ్మెల్సీగా ఎన్నికయిన వారు ఇద్దరు పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. అయితే వీరిద్దరూ ఏ పార్టీ వైపు ఉన్నారంటే వైసీపీకి మద్దతుదారులుగానే ఉన్నారు. పార్టీ నుంచి సస్పెండ్ అయినప్పటికీ వీరిపై అనర్హత వేటు పడలేదు. దీంతో వీరు సస్పెండ్ అయినా వైసీపీ నేతలుగానే శాసనమండలిలో కొనసాగుతుండటం చర్చనీయాంశమైంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దువ్వాడ శ్రీనివాస్, తూర్పు గోదావరి జిల్లా అనంతబాబులను గత వైసీపీ హయాంలో ఎమ్మెల్సీ పదవి వరించింది. వారు పార్టీ కోసం చేసిన పనితీరును గమనించి నాడు జగన్ వీరిద్దరికీ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. దువ్వాడ శ్రీనివాస్ అయితే టెక్కలి సీటు కూడా కేటాయించారు.. రంపచోడవరంలో పట్టున్న నాయకుడిగా పేరున్న అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో నిందితుడిగా మారి కొన్నాళ్ల పాటు జైలులో ఉండి బెయిల్ పై బయటకు వచ్చారు. అయితే డ్రైవర్ ను హత్య చేసి ఇంటికి పార్సిల్ చేశారన్న ఆరోపణలను గతంలో టీడీపీ చేసిన విమర్శలు జనంలోకి వెళ్లాయి. ఈ ఘటన కూడా గత ఎన్నికల్లో వైసీపీ ఓటమికి కారణమయిందని చెప్పాలి. అందుకే వెంటనే వైసీపీ నష్టనివారణ చర్యల్లో భాగంగా అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అయితే సస్పెండ్ చేసి ఇన్నేళ్లవుతున్నా పదవి మాత్రం పదిలంగానే ఉంది. దీంతో ఆయన అనధికారికంగా వైసీపీ నేతగానే చలామణి అవుతున్నారు. . ఫ్యాన్ పార్టీని షేక్ చేస్తున్నాయా? టెక్కలి నుంచి పోటీ చేసి... ఇక మరొకనేత దువ్వాడ శ్రీనివాస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ నేత, ప్రస్తుత మంత్రి అచ్చెన్నాయుడు చేతిలో ఓటమి పాలయ్యారు.

# దేశంలోనే పెద్ద రైల్వేస్టేషన్..

అమరావతి, అక్టోబరు 15, (

చంద్రబాబు సీఎంగా ఉంటే అంతే.. భారీ ప్రాజెక్టులు.. కొత్త కొత్త రంగాలు.. పరిశ్రమల, పెట్టుబడులు.. దీనికైతే కొదవ ఉండదు. విజనరీ అని అందుకే అంటారు. ముందుగానే ఆలోచించుకొని చంద్రబాబు చేస్తోన్న ఈ పనులు ఏపీ రూపురేఖలే మార్చబోతున్నాయి.ఇప్పటికే విశాఖలో గూగుల్ డేటా సెంటర్ తో ఏఐ హబ్ ను ఏర్పాటు చేయబోతున్న చంద్రబాబు ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్ ను కేంద్రం సాయంతో ఏపీలో నెలకొల్పబోతుండడంతో మన అందరికీ గర్వకారణంగా మారింది..భారత రైల్వే చరిత్రలో ఒక నూతన అధ్యాయం




రూపుదిద్దుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి సమీపంలో దేశంలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర అభివృద్ధి దిశలో ఇది ఒక కీలకమైన మైలురాయిగా భావిస్తున్నారు.ఈ ప్రతిష్ఠాత్మక రైల్వే స్టేషన్ డిజైన్ అమెరికాలోని న్యూయార్క్ గ్రాండ్ సెంట్రల్ టెర్మినల్, లండన్ సెయింట్ పాంక్రాన్ వంటి ప్రపంచ ప్రసిద్ధ కేంద్రాల నమూనాలో రూపొందించబడుతోంది. ఎయిర్‌పోర్ట్ తరహాలో అత్యాధునిక టెర్మినల్స్, సౌకర్యాలతో స్థాపించనున్న ఈ స్టేషన్ సుమారు 1,500 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబడనుంది. మొత్తం 24 ప్లాట్‌ఫామ్స్, 4 టెర్మినల్స్ ఉండగా, రోజుకు దాదాపు 3 లక్షల ప్రయాణికులు ఈ స్టేషన్ ద్వారా రాకపోకలు సాగించే అవకాశం ఉంది.

ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 2,245 కోట్లు కేటాయించింది. రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా 57 కిలోమీటర్ల బ్రాడ్ గేజ్ లైన్, అలాగే 3.2 కిలోమీటర్ల మేర కృష్ణా నదిపై కొత్త బ్రిడ్జ్ నిర్మాణం ప్రణాళికలో ఉంది. చెన్నై, కోల్కతా, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రధాన మెట్రో నగరాలతో నేరుగా రైల్వే లింకులు ఏర్పాటు చేయడం ద్వారా అమరావతి దేశవ్యాప్తంగా కీలక ట్రాన్సిట్ హబ్‌గా ఎదగనుంది.రాజధాని ప్రాంతంలో ఏర్పడనున్న ఈ ప్రాజెక్టు 2?3 సంవత్సరాల్లో పూర్తి కానుంది. రానున్న కాలంలో ఈ కొత్త రైల్వే స్టేషన్ ప్రాంతీయ రవాణా, వ్యాపార వృద్ధి, ఉపాధి అవకాశాలకు గణనీయమైన ఉత్సాహాన్ని అందిస్తుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల ఏర్పాటు ద్వారా అమరావతి నగరం దేశంలోని ఆధునిక రైల్వే నెట్‌వర్క్‌లో ఒక కీలక కేంద్రంగా రూపుదిద్దుకోనుందనే విశ్లేషణ నిపుణులది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టు, సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన “విశ్వ స్థాయి నగరం ? అమరావతి” స్వప్నానికి కొత్త ఊపు తీసుకురానుంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇది ఒక చారిత్రాత్మక మౌలిక సదుపాయాల బహుమతిగా నిలిచిపోనుంది.

# కవితది ఉద్యమ పార్టీయేనా..

హైదరాబాద్, అక్టోబరు 15,

కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో భవిష్యత్ కార్యాచరణపై ఆమె తన సన్నిహితులతో చర్చించినట్లు తెలిసింది. తనను బీఆర్ఎస్ లోకి తిరిగి తీసుకోవాలని ప్రయత్నించినా తాను చేరబోనని ప్రకటించిన కవిత ప్రస్తుతం పూర్తి స్థాయి జాగృతి నేతగా మారిపోయారు. ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామాను ఆమోదించినా ఆమోదించకపోయినా ఆ పదవి లేనట్లుగానే ఉన్నారు. ఇప్పుడు తెలంగాణ జాగృతిని బలోపేతం చేసుకునేందుకు కార్యవర్గాన్ని నియమించుకుంటూ వెళుతును?నారు. . జిల్లాల వారీగా క్షేత్రస్థాయిలో క్యాడర్ ను రెడీ చేసుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకూ ఆమె జాగృతిని రాజకీయ పార్టీగా ప్రకటించలేదు. అలాగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోటీకి కూడా దూరంగా ఉన్నట్లు కనపడుతుంది.తెలంగాణ జాగృతిలో ముఖ్యమైన నాయకులు ఎన్నికల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. తెలంగాణ జాగృతి నుంచి పోటీ చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవవచ్చని వారు అంచనా వేసుకుని కవిత వెంట తిరుగుతున్నారు. అదే సమయంలో తెలంగాణ జాగృతి సంస్థలో పదవులన్నింటినీ మైనార్టీలు, గిరిజనులకే కేటాయిస్తున్నారు. ప్రధాన పదవుల్లో వారినే నియమిస్తుండటంతో కవిత లక్ష్యం వేరేలా ఉందా? అన్న సందేహం తలెత్తుతుంది. ఇంత కాలం వారికి ఏ పార్టీలోనూ రాజకీయ ప్రాధాన్యత దక్కడంలేదని అంటున్నారు. అందుకే తాను ప్రాధాన్యం ఇస్తున్నానని కవిత చెబుతున్నప్పటికీ బీసీ రిజర్వేషన్ల ఉద్యమం కోసం తాను పని చేస్తానని కల్వకుంట్ల కవిత పదే పదే ప్రకటించుకుంటున్నారు. అయితే తెలంగాణ జాగృతి సంస్థను కేవలం ఉద్యమ సంస్థగానే ఉంచుతారా? రాజకీయ పార్టీగా ప్రకటిస్తారా? అన్న చర్చ వారి అనుచరుల్లో ప్రారంభమయింది. ఇప్పటి వరకూ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు చేస్తున్నారే తప్పించి బీఆర్ఎస్ నాయకత్వంపై మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. అలాగని గత కొద్ది రోజుల నుంచి హరీశ్ రావు, సంతోష్ రావు వంటి వారిపై కూడా విమర్శలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ విషయాలన్నీ బేరీజు వేసుకుని కల్వకుంట్ల కవితకు తిరిగి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నుంచి పిలుపు వచ్చే అవకాశముందని అంటున్నారు. రాజకీయ పార్టీగా ప్రకటించి ఉంటే కల్వకుంట్ల కవితపై కొంత నమ్మకం ఉండేదని, అలా కాకుండా ఇంకా ఉద్యమ సంస్థగానే ఉంచడంతో బీఆర్ఎస్ వ్యూహంలో భాగంగానే జరుగుతుందా? అన్న అనుమానాలు మాత్రం అందరిలోనూ కలుగుతున్నాయి.

# కూటమి మధ్య ఫిలిం కార్పొరేషన్ రచ్చ





అనంతపురం, అక్టోబరు 15,

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణల మధ్య మరో వివాదం తలెత్తినట్లు కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి విషయంలో మళ్లీ మెలిక పడినట్లే కనిపిస్తుంది. టూరిజం, సినిమాటోగ్రఫీ మంత్రిగా జనసేన నేత కందుల దుర్గేష్ ఉన్నారు. అందులోనూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినిమా రంగానికి చెందిన వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదిహేడు నెలలవుతున్నప్పటికీ ఇప్పటి వరకూ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గా ఎవరినీ నియమించకపోవం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఇది ఇద్దరి మధ్య నెలకొన్న వివాదమే కారణమని తెలుస్తోంది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నామినేటెడ్ పదవిని హోల్డ్ లో పెట్టినట్లు పార్టీ వర్గాలే గుసగుసలాడుకుంటున్నాయి.అనుకుంటున్నట్లు మరోసారి ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి విషయంలో పవన్ కల్యాణ్, నందమూరి బాలకృష్ణల మధ్య విభేదాలు తలె?తాయని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవికి పవన్ కల్యాణ్ పేరును ఎప్పుడో ఖరారు చేశారు. బహిరంగంగా కూడా చెప్పారు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గా అవుతారని ఆయన బహిరంగంగానే వెల్లడించారు. పవన్ కల్యాణ్ ప్రకటన తర్వాత అది కార్యరూపం దాల్చకపోవడానికి నందమూరి బాలకృష్ణ మెలిక పెట్టడమే కారణమన్న వార్తలు పార్టీ వర్గాల్లో హల్ చల్ చేస్తున్నాయి. దీంతో చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నియామకంలో ఆచితూచి వ్యవహారించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. బాలకృష్ణ వ్యతిరేకించడంతో... నిర్మాత ఎ.ఎం రత్నం పేరును నందమూరి బాలకృష్ణ వ్యతిరేకించినట్లు తెలిసింది. అదే సమయంలో తాను ఒక పేరును అధినాయకత్వం ముందుంచినట్లు సమాచారం. అయితే పవన్ కల్యాణ్ కు చెందిన జనసేన పార్టీ నేత సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నియామకం జరగకపోవడం ఈ ఊహాగానాలను బలపరుస్తున్నాయి. అదే సమయంలో నందమూరి బాలకృష్ణ కూడా ఇటీవల అసెంబ్లీలో ఫ్రస్టేషన్ కు లోనయింది అందుకేనంటున్నారు. అదే సమయంలో ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో లూలూ గ్రూపు విషయంలో తన అభ్యంతరాలను పవన్ కల్యాణ్ కుండ బద్దలు కొట్టినట్లు తెలిసింది. దీంతో ఇటు పవన్ కల్యాణ్, అటు నందమూరి బాలకృష్ణ ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నియామకం విషయంలో పట్టుబట్టడం వల్లనే నియామకం ఇప్పటి వరకూ జరగలేదంటున్నారు. విజయవాడ దుర్గ గుడి దేవస్థానం కమిటీ ఛైర్మన్ పదవిని తన మనిషికే ఇప్పించుకోవడంలో నందమూరి బాలకృష్ణ సక్సెస్ అయ్యార. మరి ఈ విషయంలో ఏం జరుగుతుందో చూడాలి.

# ఏపీకి గేమ్ ఛేంజర్.... ఏఐ హబ్

విశాఖపట్టణం, అక్టోబరు 15,



రా చంద్రబాబు నాయుడు నాయకత్వం మరోసారి జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ఢిల్లీలో జరిగిన “భారత్ ఏఐ శక్తి” కార్యక్రమంలో ఆయనకు లభించిన గౌరవం, ప్రశంసలు.. గూగుల్-రైడెన్ ఒప్పందం ద్వారా విశాఖపట్నంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ స్థాపన..ఇవన్నీ కలిపి ఆంధ్రప్రదేశ్‌కు చారిత్రాత్మక మలుపును సూచిస్తున్నాయి.ఐటీ రంగంలో చంద్రబాబు నాయుడుకున్న దూరదృష్టి మరోసారి నిరూపితమైంది. గతంలో హైదరాబాద్‌ను ఐటీ రాజధానిగా తీర్చిదిద్దిన ఆయన, ఇప్పుడు విశాఖపట్నాన్ని ఏఐ రాజధానిగా మలచే దిశగా బలమైన అడుగులు వేశారు.మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్‌కు తీసుకురావడంలో చూపిన అసాధారణమైన దార్శనికత, ఇప్పుడు గూగుల్ ఏఐ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకురావడంలో స్పష్టంగా ప్రతిఫలించింది.ఏఐ హబ్: ఈ ఒప్పందం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ , డేటా సెంటర్ల అభివృద్ధికి బలమైన పునాది పడుతోంది.“భారత్ ఏఐ శక్తి” కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్ , అశ్విని వైష్ణవ్ లు చంద్రబాబు నాయకత్వాన్ని ప్రశంసించడం, ఆయనకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును ఇచ్చింది. ఢిల్లీ వేదిక చంద్రబాబుకు ఒక కీర్తి పీఠంగా మారింది. తెలుగు నేతకు జాతీయ స్థాయిలో లభించిన ఈ అరుదైన గౌరవం, ఆయన అనుభవానికి, విజన్‌కు నిదర్శనం. దేశ భవిష్యత్తు కోసం సాంకేతిక రంగంలో ఆయనకున్న విజన్ మరియు నిబద్ధతను కేంద్ర మంత్రులు కొనియాడారు.నారా లోకేష్ వ్యాఖ్యల ప్రకారం, విశాఖలో స్థాపించబోయే ఈ ఏఐ హబ్ ద్వారా రాష్ట్రానికి బృహత్తర ప్రయోజనాలు చేకూరనున్నాయి. వేల సంఖ్యలో కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయి, ముఖ్యంగా యువతకు. ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు.. సాంకేతిక అభివృద్ధికి రాష్ట్రం కేంద్రంగా మారుతుంది. రాష్ట్రంలోని యువతకు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన అవకాశాలు లభించనున్నాయి. ఇది రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన బాట.ఈ ఒప్పందం చంద్రబాబు నాయకత్వాన్ని తిరిగి జాతీయ చర్చకు తీసుకురావడమే కాకుండా, రాష్ట్రానికి పెట్టుబడులు.. అభివృద్ధిని ఆకర్షించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. రాజకీయంగా ఆయనకు మళ్లీ జాతీయ స్థాయిలో ప్రాధాన్యతను కలిగించే ఘట్టంగా ఇది నిలుస్తోంది.చంద్రబాబు నాయుడు భవిష్యత్తును ఆలోచించే నేతగా మరోసారి నిరూపించుకున్నారు. విశాఖలో ఏఐ హబ్ స్థాపన మరియు ఢిల్లీ వేదికపై ఆయనకు లభించిన ‘కింగ్ సైజ్’ ఎలివేషన్ ? ఇవన్నీ కలిపి ఆంధ్రప్రదేశ్‌ను దేశ సాంకేతిక పటంలో గేమ్ చేంజర్‌గా మార్చే దిశగా సాగుతున్నాయి. ఇది తెలుగు ప్రజలకు మరియు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు గర్వించదగిన ఘట్టం.

# తిరుమల పరకామణి కేసు.. విచారణ ఎందుకు ఆగినట్టు!?

తిరుమల, అక్టోబరు 15,

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరికామణి విభాగంలో 2023లో జరిగిన దొంగతనంపై కేసు మళ్లీ దృష్టిలోకి వచ్చింది. అప్పటి ఉద్యోగి రవికుమార్ పాల్గొన్నారని అనుమానంతో టీటీడీ విజిలెన్స్ అధికారులు ఏప్రిల్ 2023లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అదే ఏడాది సెప్టెంబర్‌లో లోక్ అదాలత్ ముందు రవికుమార్‌తో రాజీ



కుదిరింది. ఈ రాజీ నిర్ణయం చట్టపరంగా ఎంతవరకు సబబు అన్న ప్రశ్నలు మొదలయ్యాయి.స్థానిక జర్నలిస్టు శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్ వేసి, ఈ చోరీపై సీఐడీ దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. ఆయన వాదన ప్రకారం, పరకామణిలో ఆర్థిక లావాదేవీలు చాలా పెద్దవి కాబట్టి దొంగతనం కేవలం సాధారణ సంఘటన కాదని పేర్కొన్నారు. పిటిషన్ విచారణ తరువాత హైకోర్టు జస్టిస్ రామకృష్ణ, లోక్ అదాలత్ ఇచ్చిన రాజీ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేసి, సీఐడీదే పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఖజానా రికార్డులు, రాజీ ఒప్పంద పత్రాలు సీజ్ చేయాలని సూచించారు. కానీ ఈ కీలక ఆదేశాలు ఇప్పటివరకు అమలుకాకపోవడంతో సీఐడీ పాత్రపై అనుమానాలు పెరిగాయి.పరకామణి లావాదేవీలు ప్రజల విరాళాలతో నడుస్తున్నందున, ఆ నిధుల భద్రతపై ఉన్నతస్థాయి పర్యవేక్షణ ఉండాల్సిందే. కానీ ఈ ఘటన తరువాత టీటీడీ అంతర్గత వ్యవస్థలో పారదర్శకత ఎంతవరకు ఉందనే ప్రశ్న తలెత్తింది. హైకోర్టు ఆదేశాల అమలులో జాప్యం కొనసాగితే, స్వతంత్ర ఆడిట్ లేదా కోట్రోల్ అధికారి విచారణ అవసరమవుతుందని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. ఇక సీఐడీ తక్షణ చర్యలు చేపడితేనే, దొంగతనం నిజానిజాలు బయటపడే అవకాశముంది.లోక్ అదాలత్ ముందుకు వచ్చిన రాజీ అనేది సాధారణంగా పౌర వివాదాలు లేదా చిన్నారుల హక్కులు లాంటి దావాలలో మాత్రమే అమల్లోకి వస్తుంది. కాని ఇక్కడి విషయం దొంగతనం, పబ్లిక్ ట్రస్ట్ నిధుల దుర్వినియోగం నేపథ్యంలో ఉంది. ఇది క్రిమినల్ నేచర్ కేసు, అంటే రాజీ ద్వారా పూర్తిగా ముగించడం చట్టపరంగా సాధ్యం కాదని న్యాయవేత్తలు స్పష్టం చేస్తున్నారు. హైకోర్టు పరిధిలోకి వచ్చే ఇటువంటి కేసుల్లో, రాజీకి మేజిస్ట్రేట్ ఆమోదం లేదా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూచన తప్పనిసరి. ఈ రెండు శరతులు తీరకపోతే, రాజీ చెల్లుబాటు కాదు.జస్టిస్ రామకృష్ణ తీసుకున్న తాత్కాలిక నిర్ణయం లోక్ అదాలత్ ఉత్తర్వులను నిలిపివేసి, సీఐడీ విచారణను ఆదేశించడం న్యాయపరంగా ప్రజా ప్రయోజన రక్షణ చర్యగా గుర్తించబడింది. ఎందుకంటే ఈ వ్యవహారం ప్రజల విరాళాలకు సంబంధించినది. ఇందులో రాజీ ద్వారా నిందితుడిపై చర్య నిలిపివేయడం పబ్లిక్ ఫండ్ మిస్యూస్‌ను క్షమించడమే అవుతుంది, ఇది చట్టపరంగా అనుచితం.సీఐడీకి కోర్టు స్పష్టంగా ఖజానా లావాదేవీల రికార్డులు, రాజీ ఆధార పత్రాలు సీజ్ చేయమని ఆదేశించింది. కానీ సీడీ ఆదేశం అమలు చేయకపోవడం న్యాయపరంగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. ఇలాంటి పరిస్థితిలో హైకోర్టు సీఐడీ అధికారులపై కాంటెంప్ట్ ఆఫ్ కోర్టు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# గూగుల్ రాకతో మారనున్న విశాఖ రూపురేఖలు

అమరావతి గతంలో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ రూపురేఖలు మార్చింది.. ఇప్పుడు గూగుల్ పెట్టుబడులతో విశాఖ రూపురేఖలు మార్చబోతుందని మంత్రి లోకేష్ అన్నారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు.మంత్రి మట్లాడుతూ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద ఏపీకి పరిశ్రమలు తరలివస్తున్నాయి.. కేవలం డేటా సెంటర్ మాత్రమే కాదు.. ఏఐకి సంబంధించిన అనేక కంపెనీలు విశాఖకు వస్తున్నాయి. గూగుల్ పెట్టుబడి వల్ల లక్ష మందికిపైగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయని అన్నారు.సెప్టెంబర్-2024లో గూగుల్ ప్రతినిధులు విశాఖ వచ్చినప్పుడు వారితో సమావేశమయ్యాను.. గూగుల్ ప్రతినిధులకు డేటా సెంటర్ స్థలాన్ని చూపించాం. ఇది జరిగిన నెలరోజుల్లో యూఎస్కు వెళ్లి గూగుల్ క్లౌడ్ నాయకత్వాన్ని కలిశాను.. 2024 నవంబర్లో గూగుల్ ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిశారు. ఇదే అంశంపై ప్రధాని మోదీ, కేంద్రమంత్రి నిర్మలతో సీఎం చంద్రబాబు అనేకసార్లు భేటీ అయ్యారు.. అనేక చర్చల తర్వాత ఇంత పెద్ద పెట్టుబడి సాధ్యమైంది. భారీ పెట్టుబడులపై అన్నిచోట్ల చర్చలు జరుగుతున్నాయని లోకేష్ వెల్లడించారు.

# నాగబాబు మౌనం దేనికి సంకేతం




విజయవాడ, అక్టోబరు 15


జనసేన ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటారు. అయితే గత కొద్ది రోజుల నుంచి ఆయన మౌనంగా ఉంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి పెద్దగా ప్రస్తావించడం లేదు. ఎక్స్ లోనూ పోస్టు కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం తన అన్న చిరంజీవిపై అసెంబ్లీలో నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలే కారణమని అంటున్నారు. సహజంగా నాగబాబు తన సోదరులు ఎవరిపైనా విమర్శలు వస్తే అసలు ఊరుకోరు. ఆయన వెంటనే కౌంటర్ ఇస్తారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఉండటంతో పాటు తాను పార్టీ ఎమ్మెల్సీగా ఉండటంతో నాగబాబు కొంత తనను తాను సంబాళించుకుని సంయమనంతో వ్యవహరిస్తున్నారని అంటున్నారు. నిజానికి చిరంజీవి ఫ్యాన్స్ హైదరాబాద్ లో మీటింగ్ పెట్టినప్పుడు కూడా నాగబాబుకు తెలిసే జరిగిందంటారు. ఆయనను సంప్రదించిన తర్వాతనే చిరంజీవి బ్లడ్ బ్యాంకులో మీటింగ్ వారు పెట్టుకున్నారని, అయితే తాను మాత్రం పెదవి విప్పకుండా కొంత సంయమనం పాటించారని చెబుతున్నారు. అసెంబ్లీలో నందమూరి బాలకృష్ణ మాట్లాడిన దానికి మెగాస్టార్ చిరంజీవి ఒక ప్రకటన చేసి ఊరుకున్నారు. అయితే మెగా ఫ్యాన్స్ మాత్రం ఇప్పటికీ సోషల్ మీడియాలో నందమూరి బాల కృష్ణకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతూనే ఉన్నారు. దీనిని కూడా నాగబాబు కానీ, పవన్ కల్యాణ్ కానీ ఎవరూ ఖండించలేదు. అసలు ఆ విషయాన్ని ఇద్దరూ ఇంతవరకూ ప్రస్తావించలేదు. గతంలో బాలకృష్ణ పై నాగబాబు చేసిన విమర్శలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పవన్ కల్యాణ్ అంటే ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టి మౌనంగా ఉన్నారని భావించినా నాగబాబు సైలెంట్ గా ఉండటానికి మాత్రం కారణం రాజకీయ కారణమేనని అంటున్నారు. అయితే మౌనంగా ఉన్నప్పటికీ తన కోపాన్ని సన్నిహితుల వద్ద నాగబాబు ప్రస్తావిస్తున్నట్లు సమాచారం. నాగబాబు విదేశాల నుంచి వచ్చిన చిరంజీవితో భేటీ అయిన సందర్భంలోనూ ఈ ప్రస్తావన రావడంతో చిరంజీవి కూడా ఆ విషయాన్ని వదిలేయాలని సూచించడంతో నాగబాబు మౌనంగా ఉన్నారని అంటున్నారు.


# టొరొంటో తెలుగు కమ్యూనిటీ (టీటీసీ) కెనడా టొరంటో లో దసరా మరియు బతుకమ్మ వేడుకలు – "అంబరాన్ని అంటిన సంబరాలు".


























(కెనడా నుండి ప్రత్యేక ప్రతినిధి)అక్టోబర్ 15:

టొరొంటో తెలుగు కమ్యూనిటీ (టీటీసీ) ఆధ్వర్యంలో కెనడా లోని టొరంటో నగరంలో తెలుగు ప్రజలందరూ ఒక దగ్గరకు చేరి దసరా మరియు బతుకమ్మ సంబరాలను అత్యంత భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సంబరాలలో దాదాపు 900కు పైగా తెలుగు వాసులు స్థానిక ఈస్ట్‌డేల్ %జఎ×% కాలేజియేట్, ఒషావా, టొరొంటో, కెనడా లో పాల్గొని దసరా పండుగను విజయవంతం చేశారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ వేడుకల్లో కుటుంబ సభ్యులు, స్నేహితులు ఉల్లాసంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బోర్డు అఫ్ డైరెక్టర్స్ సభ్యులు, శ్రీ ప్రదీప్ కుమార్ కనమర్లపూడి గారు మాట్లాడుతూ కెనడా లోని తెలుగు ప్రజలకు దసరా సంబరాలపై ఉన్న ఆసక్తి ని మరియు బతుకమ్మ పండుగపై ఉన్న భక్తిశ్రద్ధలను కొనియాడారు.

టొరొంటో తెలుగు కమ్యూనిటీ , బోర్డు అఫ్ డైరెక్టర్స్ సభ్యులు, శ్రీ కొత్తూరి సి మధుసూధన్ రావు గారు మాట్లాడుతూ మా అసోసియేషన్ ప్రతి సంవత్సరం దసరా మరియు బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది అని అన్నారు. దసరా , బతుకమ్మ పండుగల విశిష్టతను గురించి శ్రోతలకు చక్కగా వివరించారు. ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.

టొరొంటో తెలుగు కమ్యూనిటీ బోర్డు అఫ్ డైరెక్టర్స్ సభ్యురాలు, శ్రీమతి రమా గాయత్రీ సోంభొట్ల గారు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను జరుపుకోవడం మూలంగా మన తెలుగు పండుగలని మరియు సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేసి ముందుకు తీసుకు వెళ్లడానికి దోహదం చేస్తాయి అని వ్యక్తీకరించారు. మరొక బోర్డు అఫ్ డైరెక్టర్స్ సభ్యులు, శ్రీ రవికిరణ్ కొపల్లె గారు 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా ఎవ్వరేమనినా పొగడరా నీతల్లి భూమి భారతిని నిలుపరా నీ జాతి నిండు గౌరవముతో' అనే విధముగా టొరొంటో తెలుగు కమ్యూనిటీ కృషి చేస్తుందని తెలిపారు.

కార్యక్రమంలో ప్రత్యేక పోటీలు అన్ని వయస్సుల వారికి నిర్వహించబడ్డాయి. ఎన్నో రకాల సరదా ఆటలు నిర్వహించారు. విజేతలకు బోర్డు అఫ్ డైరెక్టర్స్ సభ్యులు, శ్రీ సుధాకర్ రెడ్డి సింగన గారు బహుమతులు అందజేసారు. ముఖ్యంగా 9–రోజుల నవరాత్రి ఆన్‌లైన్ పోటీలు ఘన విజయంగా నిలిచాయి. ప్రతి రోజు నిర్వహించిన డైలీ క్విజ్‌లో తెలుగు కమ్యూనిటీ సభ్యులు, యువత, పిల్లలు విశేష ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన వాళ్ళకి, సత్యభామ కల్లక్షన్స్, కాచిగూడా జంక్షన్, విట్బి మరియు పోప్పిన్ కిడ్స్ వారు బహుమతులు అందజేసారు. నమస్తే సూపర్ మార్కెట్ వారు 5 గ్రాముల వెండి నాణాలు (5) బహుమతిగా అందజేసారు.

ఈ వేడుకలకి ఇతర తెలుగు సంస్థల నుంచి ప్రత్యేక అతిథులు విచ్చేసారు. వారు మాట్లాడుతూ, ఈ సంబరాలని చూడటం ఎంతో ఆనందంగా ఉంది అని కొనియాడారు. అలాగే కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన టొరొంటో తెలుగు కమ్యూనిటీ వారిని అభినందించారు. బోర్డు అఫ్ డైరెక్టర్స్ సభ్యులు, శ్రీ నరేంద్ర బొమ్మినేని గారు, శ్రీ విజయ్‌కుమార్ కోట గారు విచ్చేసిన అతిథుల అందరినీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి విచ్చేసిన వారికి రాఫెల్ డ్రా నిర్వహించి గెలిచిన వారికి ఒక గ్రాము బంగారం బహుమతిగా అందజేయడం జరిగింది. ఈ సంబరాలలో బతుకమ్మ ఆట సుమారు 2 గంటలు ఏకధాటిగా ఆట పాటలతో ఉత్సాహంగా కొనసాగింది.

ఈ వేడుకలను బోర్డు అఫ్ డైరెక్టర్స్ సభ్యులు: శ్రీ ప్రదీప్ కుమార్ కనమర్లపూడి, శ్రీమతి రమా గాయత్రీ సోంభొట్ల, శ్రీ కొత్తూరి సి మధుసూధన్ రావు, శ్రీ నరేంద్ర బొమ్మినేని, శ్రీ రవికిరణ్ కొపల్లె, శ్రీ గిరీష్ బొడ్డు, శ్రీ సుధాకర్ రెడ్డి సింగన, శ్రీ విజయ్‌కుమార్ కోట అలాగే ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, శ్రీ అనిల్ కుమార్ శ్రీపతి, శ్రీ అనిల్ కుమార్ తెల్లమేకల, శ్రీ దాస్ శంకర్, శ్రీ ధనుంజయ పబ్బతి, శ్రీ కల్యాణ్ నర్సాపురం, శ్రీ కమల్ కిశోర్ నెల్లీ, కరీమ్ సయ్యద్, మాన్సూర్ మహమ్మద్, శ్రీమతి రాధికా దలువై, శ్రీ రామకృష్ణ సామినేని సమిష్టిగా చాలా ఘనంగా నిర్వహించారు.

సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ బతుకమ్మ సంబరాలు, నృత్యాలు, పాటలతో వేడుక రసవత్తరంగా సాగింది. నృత్య మాధురి అకాడమి, శ్రీ సాయిదత్త అకాడమి, స్వాస్తికం డాన్స్ అకాడమి, వారి నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రిషా గొల్ల, కీర్తి జక్కంపూడి, కీర్తన గుత్తికొండ, సించన నాగెల్ల, అనన్య బేతి ల కూచిపూడి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే సంస్కృతి డ్రమాటిక్స్ వాళ్ళ ప్రహ్లాద నాటకం ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

టొరొంటో తెలుగు కమ్యూనిటీ లోకల్ బిజినెస్ లని ప్రతి వేడుకల్లో ప్రోత్సహిస్తూ వస్తుంది. ఇందులో భాగంగా విభిన్నమైన విక్రేత స్టాల్స్ ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ రుచికరమైన భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. స్పాన్సర్లు, వాలంటీర్లు మరియు కమ్యూనిటీ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతమైందని బోర్డు అఫ్ డైరెక్టర్స్ సభ్యులు, శ్రీ గిరీష్ బొడ్డు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చివరగా టొరంటో తెలుగు కమ్యూనిటీ బోర్డు అఫ్ డైరెక్టర్స్ సభ్యులు శ్రీ ప్రదీప్ కుమార్ కనమర్లపూడి గారు స్పాన్సర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ కార్యక్రమాన్ని ముగించారు.

## చిగురంత ఆశ జగమంత వెలుగు

మనిషి ఆశాజీవి
రేపటి మీద ఆశ
నేటి కష్టాలనుఓర్చుకొని
ఓపికను నేర్పుతుంది
నెరవేరుతాయనే ఆశ
ముందుకు నడిపిస్తుంది
ఆశ పోరాట పటిమనిస్తుంది
ఆశ ఆత్మవిశ్వాసాన్ని
కలిగిస్తుంది
ఆశ అభివృద్ధికి మెట్టు
ఆశ ఆశయాలకు
ఆలంభణ
ఆశలు అశ్వాల వంటివి
అధుపుతప్పితే బతుకు
అగమ్యగోచరం
అత్యాశ నిరాశ ప్రగతికి
ప్రతిబంధక మౌతుంది
దురాశ దుర్బుద్ధిని
ఆశ్రయించిన వారు
నాశనం వైపు వెలతారు
ఆశ మనిషికి తీరని తృష్ణ
సముద్రంలో అలలు
కడుపులో ఆకలి
చెరువులో చేపలు
మనసులో ఆశలు
మళ్ళీ మళ్ళీ పుడతాయి
మనిషి కోరికల పుట్ట
కోరికలు అపరిమితం
కోరికలు పరస్పరం
పోటీ పడతాయి
ఆశనేరవేరితే ఆనందం
ఆశలు విఫలమైతె నిరాశ
ప్రకృతిలో ప్రాణికోటికి
ఉచ్ఛ్వాస నిశ్వాసలు
ఎంత సహజమో
మనిషికి ఆశ నిరాశలు
కూడా అంతే సహజం
ఆనందకరమైన జీవనానికి
ధనంతో పాటు
స్నేహం నమ్మకం ప్రేమ శాంతి
ఆత్మీయత అనురాగం కావాలి
ఆశ బలంగా వుంటే
కోల్పోయిన ఆనందానికి జీవం పోయవచ్చు

చిగురంత ఆశ
జగమంత వెలుగు
సానుకూల దృక్పథం
అత్యాశ దురాశలకు
దూరంగా ఉంటూ
నిరాశ నిస్పృహను
ధరిచేయనీయకజి
ఆశనే శ్వాసగా
ముందుకు సాగాలి

నేదునూరి కనకయ్య
ఫ్రీలాన్స్ రచయిత సామాజిక ఆర్థిక విశ్లేషకులు
కరీంనగర్9440245771

## విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు.

### వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష

### హాజరైన కలెక్టర్ ఎం. హరిత.




రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 15

(భారత శక్తి) : బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం పై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు, సంక్షేమ శాఖ మంత్రివర్యులు లక్ష్మణ్ కుమార్ , ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ఎం. హరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ప్రైవేటు పాఠశాల యాజమాన్యం వారి బడులలో చదివే విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులకు గురి చేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. కలెక్టర్లు వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యాజమాన్యులతో సమావేశమై విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.సామాజిక బాధ్యతగా భావించి విద్యా రంగం పై ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం క్రమ పద్ధతిలో విడుదల చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కలెక్టర్లు జిల్లా విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుంటూ పాఠశాల యాజమాన్యులతో చర్చించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. తదనాంతరం కలెక్టర్ ఎం. హరిత మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ 7 ఉండగా, 338 మంది చదువుతున్నారని, అలాగే ఎస్టీ విద్యార్థులకు ఒక స్కూల్ ఉండగా 35 మంది విద్యార్థులు చదువుతున్నారని కలెక్టర్ ఎం. హరిత తెలిపారు. ఆయా విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఇంచార్జి విద్యాధికారి వినోద్ కుమార్, డీఎస్ సీడీఓ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైజింగ్ విజన్ -2047 సర్వేలో ప్రజలు, ఉద్యోగులు పాల్గొనాలి

భూపాలపల్లి, భారత శక్తి, అక్టోబర్ 15:

తెలంగాణా రాష్ట్రాన్ని రానున్న రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ రంగాలలో అగ్రగామిగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్ - 2047 డాక్యుమెంటు ను రూపొందిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ విజన్ 2047 డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రతి ఒక్క పౌరుడి భాగస్వామ్యం ఉండేలా సిటిజన్ సర్వే చేపట్టారు. అక్టోబర్ 10వ తేదీన

TELANGANA RISING 2047 Take Citizen Survey Now

ప్రారంభమైన ఈ సర్వేలో రాష్ట్ర ప్రజలు, ఎన్.ఆర్.ఐ లు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. కాగా ఈ లితెలంగాణ రైజింగ్ విజన్ -2047లి సర్వేలో రాష్ట్రంలో వివిధ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు అందించాల్సిందిగా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సర్క్యులర్ జారీ చేసింది. ఈ నెల 25 వ తేదీ వరకు జరిగే విజన్–2047 సర్వేలో అందరు ఉ ద్యోగులు పాల్గొనడంతో పాటు ఈ సర్వే యొక్క లింక్ ను, క్యూ ఆర్ కోడ్ ను తమ తమ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా రామ క్రిష్ణా రావు జారీ చేసిన ఆ సర్క్యులర్ లో ఆదేశించారు. ఈ సర్వేలో పాల్గొనేందుకుగాను %http // www.telangana. gov.in/telangana risingఅనే లింక్ ద్వారా పాల్గొనాలని సీఎస్ ఒక ప్రకటనలో తెలి

## ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం సరికాదు: డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సుధాకర్ రెడ్డి.

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 15 (భారత శక్తి) : పాఠశాలల తనిఖీ నిమిత్తము ఉపాధ్యాయులతో పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని,ఇది విద్యారంగ తిరోగమన చర్య అని, మరింత విద్యారంగా సంక్షోభానికి దారితీస్తుందని అన్నారు.పాఠశాల విద్యారంగానికి తిరోగమన చర్యగా భావిస్తున్నట్లు డిటిఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అవురం సుధాకర్ రెడ్డి,వంగ తిరుపతిలు ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్థులకు పాఠశాలలో విద్యాబోధన చేయవల్సిన ఉపాధ్యాయులు పర్యవేక్షణల పేరుతో పాఠశాలకు దూరంగా ఉంటే, విద్యాబోధన కుంటుపడుతుందని మండిపడ్డారు, పదవతరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో లక్ష్యం పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 1473 మంది ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించి విద్యార్థులకు విద్యా బోధన నుండి దూరం చేయడమేనని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రమోషన్ల ద్వారా ఖాళీగా ఏర్పడినటువంటి ఉపాధ్యాయ పోస్టులు తక్షణమే నియామకాలు చేపట్టి, విద్యాబోధన కుంటుపడకుండా చూడాలన్నారు, అలాగే ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించకుండా వారిని విద్యా బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించి ఖాళీగా ఉన్న డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈఓ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, తద్వారా పాఠశాలలను వారి ద్వారా పర్యవేక్షణ చేయాలని కోరారు.

## మెడికల్ కళాశాలలో క్రీడా మైదానం ఏర్పాటు కు కృషి: జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 15:

సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో క్రీడ మైదానం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య ఆదేశించారు . కళాశాల ప్రాంగణంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన క్రీడా మైదానం (స్పోర్ట్స్ గ్రౌండ్) ఏర్పాటు కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులకు సూచించారు .

సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రాంగణంలో పర్యటించారు . ఆర్ అండ్ బి (రోడ్స్ అండ్ బిల్డింగ్స్) ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి (డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ) జి జి హెచ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు కలిసి కళాశాల ప్రాంగణంలో స్పోర్ట్స్ గ్రౌండ్ ఏర్పాటుకు కొరకు అవసరమైన స్థలం సర్దుబాటు మార్గాలపై సమీక్షించారు. . కళాశాల విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించేందుకు ఆధునిక సౌకర్యాలతో కూడిన క్రీడా మైదానం ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక వికాసం,పెంపొందుతుందని తెలిపారు. మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న క్రీడా ప్రాంగణంలో క్రికెట్ ప్రాక్టీసింగ్ నెట్ కోర్టులు , వాలీబాల్ కోర్ట్ , త్రోబాల్ కోర్టు, బాస్కెట్‌బాల్ కోర్ట్ బ్యాడ్మింటన్ , వంటి క్రీడలకు అనువైన మల్టీపర్పస్ ప్లే గ్రౌండ్ రూపకల్పన చేయాలని జిల్లా క్రీడా అధికారి ఖాసీం భెగ్ కు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నర్సింలు , రవికుమార్ ,జి జి హెచ్ ఈ ఈ శ్రీనివాస్ రెడ్డి , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గీతంలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 15:

గీతం స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ లోని అప్లైడ్ సైకాలజీ విభాగం ఈనెల 10-16వ తేదీ వరకు ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఇది ప్రపంచ మానసిక ఆరోగ్య విద్య, అవగాహన, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా బలమైన వాదనను ప్రోత్సహించాలని లక్ష్యించారు. 'మానసిక ఆరోగ్యం లేకుండా సంతోషంగా ఉండలేరు' అనే నినాదంతో, ముఖ్యంగా సంక్షోభాల సమయంలో వ్యక్తుల మానసిక శ్రేయస్సుకు మద్దతు ఇవ్వడం చాలా ముఖ్యమని, అది ప్రాణాలను కాపాడడవే గాక మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తుందని, వ్యక్తులు, సమాజాలను బలపరుస్తుందని విశ్వసిస్తున్నారు. వారం రోజుల కార్యక్రమాలలో భాగంగా, మనస్తత్వ శాస్త్ర విద్యార్థులు ఒత్తిడి, ఆదర్శ లేదా నిజమైన స్వీయ ఆందోళనను అర్థం చేసుకోవడంపై ఆర్ట్ థెరపీ కార్యశాలబీ



కెరీర్, ఆరోగ్యం, శ్రేయస్సు, తెలివితేటలు, వ్యక్తిత్వం, సంబంధాలపై మానసిక స్థితిని పరీక్షించే మైండ్ క్వెస్ట్‌బీ వివక్ష, సంస్కృతి, మనస్సును విప్పడంపై ఆతిథ్య ఉపన్యాసం, ఓ సరదా స్కిట్, ఓపెన్ మైక్ వంటి పలు ముఖాముఖి, సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వీటితోపాటు రిజల్యూషన్, కృతజ్ఞతా చెట్టు, భావోద్వేగాల బూత్, బయో-మోడల్ ప్రెజెంటేషన్, లెటర్స్ టు యువర్ ఫ్యూచర్ సెల్ఫ్ వంటివి కూడా నిర్వహించారు. ఇవన్నీ ఆత్మపరిశీలన, సానుభూతిని పెంపొందించేలా రూపొందించారు. అధ్యాపకులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేసి ప్రేరేపించడమే గాక, రోజువారీ జీవితంలో స్వీయ సంరక్షణ, భావోద్వేగ సమతుల్యత, మానసిక శ్రేయస్సు యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. మానసిక సమస్యలపై ప్రజా అవగాహన అవశ్యం: డాక్టర్ దల్జీత్ కౌర్ మానసిక ఆరోగ్యం గురించి చర్చించడంలో దాపరికం లేకుండా వ్యవహరించడం, సహాయం కోరడానికి సంకోచించకూడదనే ప్రజా అవగాహన ప్రయత్నాలు ముడిపడి ఉన్నాయని కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, డాన్ హెల్తీ మైండ్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ దల్జీత్ కౌర్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవంలో భాగంగా, బుధవారం ఆమె గీతంలో 'వివక్ష, సంస్కృతి, మనస్సు విప్పడం'పై ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఇంగ్లాండ్ యొక్క టైమ్ టు చేంజ్ ప్రచారం గురించి చెబుతూ, మానసిక అనారోగ్యాన్ని బలహీనతగా భావించే సామాజిక పక్షపాతాలను ఎదుర్కోవడానికి స్వీయ కథలు, భాషా సంస్కరణల ప్రాముఖ్యతను ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. సంస్కృతిని మానసిక శ్రేయస్సు కోసం వనరుగా చూడవలసిన అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు. అభిజ్ఞా చికిత్స అంతర్గత వివక్ష చూపకుండా ప్రతికూల అవగాహనలను సమర్థవంతంగా తగ్గించగలదని, మానసిక వ్యాధి బారిన పడిన యువతకు మద్దతు ఇవ్వడానికి వివక్ష చూపని విధానాన్ని అందిస్తుందని డాక్టర్ కౌర్ తేల్చి చెప్పారు.

## కామారెడ్డి పట్టణ బీజేపీ దళిత మోర్చా కార్యవర్గ ఎన్నిక

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 15: గౌరవ శాసన సభ్యులు శ్రీ కాటిపల్లి వెంకట రమణ



రెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో బుధవారం కామారెడ్డి పట్టణ బీజేపీ దళిత మోర్చా (ఎస్సీ) నూతన కార్యవర్గాన్ని బీజేపీ దళిత మోర్చా పట్టణ అధ్యక్షుడు సంగీ రాజేందర్ ప్రకటించడం జరిగింది. ఉపాధ్యక్షులుగా రాజు, నవీన్, కిషన్, కల్లూరి రూపేష్ , ప్రధాన కార్యదర్శులు గా పత్రి నవీన్, పెరుమండ్ల గంగోలి, కార్యదర్శి లుగా రవీందర్, సత్యనారాయణ, అశోక్, నాగరాజు నరేందర్, కార్యవర్గ సభ్యులుగా సుతారి స్వామి , కొనింటి గణేష్ , శేఖర్ , భరత్, శివకుమార్ , రవి, శివ, శివరాజు, శంకర్ పడిగే, రాకేష్ కల్లూరి, సన్నీ, బందెల బాలనర్సు, పడిగే కుమార్, కల్లూరి శ్రీకాంత్, రేణుక, గీత, ప్రియ లను నియమిస్తున్నట్లు తెలియజేశారు. పట్టణ బీజేపీ దళిత మోర్చా నూతన కార్యవర్గాన్ని పట్టణ బీజేపీ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ శాలువాలతో సన్మానం చేయటం జరిగింది. బీజేపీ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తూ పార్టీ పటిష్టతకు అందరం కలిసి ముందుకు సాగాలని అన్నారు.

# పేట కాంగ్రెసులో ఏం జరుగుతోంది...?

### -పటేల్ రమేష్ రెడ్డి ఇలాకాలో...ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన- వేణారెడ్డి

### -రహస్యంగా...ఇరువూరు కలిసిపోయారా...?

సూర్యాపేట, భారత శక్తి ప్రతినిధి,అక్టోబర్ 15:

సూర్యాపేట కాంగ్రెస్ పార్టీలో ఏం జరుగుతోంది...? ఇది ప్రస్తుతం సూర్యాపేట నియోజకవర్గం రాజకీయ వర్గాల్లో రహస్యంగా జరుగుతున్న చర్చ. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఎక్కువగా ముచ్చటించుకుంటున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బాలెంల గ్రామం



రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి స్వగ్రామం అన్న సంగతి అందరికీ తెలిసిందే! తన గ్రామంలో ఎటువంటి కార్యక్రమాలు జరిగిన రాజకీయంగా మరి ఇతర ఏ రకంగా నైనా రమేష్ రెడ్డి కచ్చితంగా పాల్గొంటారు అదేవిధంగా ఆయన వర్గీయులు పాల్గొంటారు. కాగా బుధవారం ఆ గ్రామంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి మాజీ మంత్రి దివంగత నేత రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ప్రధాన అనుచరులు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి వచ్చి ప్రారంభించడం చూసిన అన్ని రాజకీయ పార్టీల నాయకులలో కొందరు అది ప్రోటోకాల్ అని అంటున్నారు. మరికొందరు దీన్ని ప్రత్యేక రాజకీయ చర్యగా భావిస్తున్నారు. భవిష్యత్తులో సూర్యాపేటలో జరగబోయే రాజకీయ పరిణామాలు ఈ ప్రారంభోత్సవాల కార్యక్రమంలో ఏదైనా అంతరార్థం దాగి ఉందా అన్న ప్రశ్న తలెత్తుతోంది. మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో కాలం చేసిన సంగతి అందరికీ తెలిసిందే! ఆయన కుమారుడు సర్వోత్తమ్ రెడ్డి కి సూర్యపేట నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలు అప్పగించాలని దామోదర్ రెడ్డి వర్గీయులు అందరూ కోరుకుంటున్నప్పటికీ బయటికి కనిపించే విధంగా రాజకీయ నాయకులు అంతరంగా స్వభావాన్ని బయటపెట్టరన్న సంగతి తెలిసిన కొందరు ఏమో ఎప్పుడు ఎవరు ఎలా మారుతారో ఏం జరుగుతుందో అన్న అనుమానాలు ఆలోచనలు చేస్తున్నారు. ఎంతైనా రాజకీయ నాయకులు వారు వారు ఒకటి ప్రజలే పిచ్చోళ్ళు అన్న సందర్భాలు చాలా చూశాం. కాకపోతే ఎవరి శాఖా పనులు వారు చూసుకోవాలి అనుకొని ఉండొచ్చా...? లేక రహస్యంగా ప్రత్యేక రాజకీయాలు చేస్తున్నారా ప్రజలకు పాలు పోవట్లేదు. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా డిసిసి అధ్యక్ష బాధ్యతలు ఎవరికి అప్పగించాలి సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలు ఎవరికి అప్పగించాలి అనే సమావేశాలు ఎఐసిసి పరిశీలకులు నేరుగా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చేరుకొని రమేష్ రెడ్డి తో పాటు ఆయన వర్గీయులను అదేవిధంగా దామోదర్ రెడ్డి వర్గీలను కలిపి నిర్వహించిన సమావేశాలలో పాల్గొన్న వారి పేర్లను ప్రకటించే సమయంలో దామోదర్ రెడ్డి వర్గీయులు సోషల్ మీడియాలో రమేష్ రెడ్డి పేరును గాని ఆయన వర్గీయుల పేర్లను గాని ఎక్కడ ప్రకటించలేదు. కేవలం దామోదర్ రెడ్డి వర్గీయుల పేర్లను మాత్రమే పాల్గొన్నట్లుగా సోషల్ మీడియాలో ప్రకటించారు. ఓవైపు ఇటువంటి పరిస్థితులు పేట కాంగ్రెస్ లో జరుగుతున్నప్పటికీ,రమేష్ రెడ్డి ఇవేవీ పట్టించుకోకుండా స్వయంగా తన గ్రామంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభ కార్యక్రమాల లో పాల్గొనక పోవడం అదేవిధంగా ఆ కార్యక్రమానికి తన అనుయాయులను పంపడం ఆ కార్యక్రమాలలో పాల్గొన్న రమేష్ రెడ్డి వర్గీయుల పేర్లను సోషల్ మీడియాలో దామోదర్ రెడ్డి వర్గీయులు ప్రకటించడం అంతా అంతరంగిక రాజకీయంలో ఒక భాగం అని అందరూ అనుకుంటున్నారు.

## జువెనైల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం మైనర్ నిందితుడిపై కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 15 (భారత శక్తి)

కన్న తండ్రిని తనయుడు చంపిన ఘటన నిర్మల్ జిల్లా తానూరు మండలం లో చోటుచేసుకుంది. ఈ మేరకు బుధవారం బైంసా పట్టణంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల వివరాలు వెల్లడించారు. నిర్మల్ జిల్లా తానూరు మండలం ఎల్వి గ్రామంలో ఆగస్టు 31న వన్నేవాడ్ లక్ష్మణ్ మిస్ అయ్యాడనీ కుటుంబీకులు తానూరు పి.ఎస్ లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ పిర్యాదును అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్,సి. ఐ మల్లేష్,ఎస్సై లు జుబేర్, పెర్సిస్,అశోక్ లు చాకచక్యంగా వ్యవహరించి తనయుడే(మైనర్) తండ్రిని హత్య చేశాడని నిర్ధారించారని పేర్కొన్నారు. వాళ్ల పెంపుడు కుక్కే తమ పొలంలో మృతదేహాన్ని పాతిపెట్టిన స్థలాన్ని గుర్తు పట్టిందన్నారు. కొడుకుని లక్ష్మణ్ సరిగ్గా చదువు రాదని, పని సరిగ్గా రాదని తిడుతూ ఉండేవాడని, ఈ నేపథ్యంలోనే వాళ్ల పొలంలో గొడ్డలితో కొట్టి హత్య చేసి, గడ్డపారతో గుంత తవ్వి గోన సంచులలో పెట్టి, పూడ్చి వేశారని పేర్కొన్నారు. తానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్వి గ్రామ శివారులో తండ్రిని హత్య చేసి మృతదేహాన్ని దాచిన ఘోర ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పోలీసు అధికారి డా. జి. జానకి షర్మిల, ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించడంతో, భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో పోలీసులు వేగవంతంగా దర్యాప్తు చేసి జూవైనల్ ను పట్టుకున్నారు. గత కొంత కాలంగా కుటుంబ విషయాలలో తండ్రి మందలింపులు, చదువులో విఫలం కావడం వల్ల మనస్థాపానికి గురై, తన తండ్రి వన్నెవడ్ లక్ష్మణ్ ను 31-08-2025 న రాత్రి చేనులో గొడ్డలితో దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ విషయం పై ఆ బాలుడు తన తండ్రిని చంపింది నేనే అని పోలీసు సమక్షంలో నేరాన్ని ఒప్పుకున్నాడు. ఈ పంచనామా ప్రక్రియను జి. మల్లేష్, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్, తానూర్ ఆధ్వర్యంలో నిర్వహించగా, పంచులుగా మొగిలి గ్రామానికి చెందిన పంచలింగ్ సాయినాథ్ మరియు ముకొలు దర్శన్ హాజరయ్యారు. తానూర్ పోలీసు స్టేషన్ వారు ఈ కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం నిందితుడు మైనర్ కావున, చైల్డ్ జస్టిస్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.




ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..లి

ఈ ఘటన చాలా బాధాకరమైనది. కుటుంబ విభేదాలు, చదువులో ఒత్తిడి వంటి అంశాలు తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉంది. ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు వారి పిల్లలకు మంచి చెడులు నేర్పాలి. పిల్లల మానసిక స్థితిని గమనిస్తూ, వారికి సరైన మార్గదర్శకత్వం ఇవ్వడం తల్లిదండ్రుల బాధ్యత." అని తెలిపారు. పిల్లలు మైనర్ అయినా, చట్టం ముందు ప్రతి నేరం తీవ్రంగా పరిగణించబడుతుంది. 'జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్, 2015' ప్రకారం, మైనర్ నిందితులపై కూడా న్యాయపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఈ చట్టం పిల్లల సంరక్షణతో పాటు, నేర నిరోధం లక్ష్యంగా పనిచేస్తుంది అని తెలిపారు


జూవైనల్ వద్ద స్వాధీన పరుచుకున్న వస్తువులు:

1. తండ్రిని చంపడానికి ఉపయోగించిన గొడ్డలి
2. శవాన్ని పూడ్చుడానికి వాడిన గడ్డపార
3. ఇనుప సలాకలు

పోలీసులు వీటిని పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా దర్యాప్తు జరిపి త్వరగా జూవైనల్ ను పట్టుకోవడంలో కృషి చేసిన భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ ఐపీఎస్, ముధోల్ ఇన్స్పెక్టర్ మల్లేష్, ఎస్ఐలు అశోక్ , పెర్సిస్, నరేష్,జుబేర్ మరియు కానిస్టేబుల్లు చౌహాన్ కృష్ణ, శ్రావణ్ లను జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు.

## భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి.నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (భారత శక్తి ): భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 9 మంది అర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.

ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం' పాత్ర:

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు "నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష:

ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

### వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 15 (భారత శక్తి):బుధవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు తో కలిసి హైదరాబాదు నుంచి, అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాల వారిగా కలెక్టర్లు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అన్నారు. అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిపడినన్ని గన్ని సంచులు, తూకపు, తేమ యంత్రాలు, టార్పలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు, త్రాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. వరి ధాన్యం తరలింపునకు సరిపడినన్ని లారీలను సమకూర్చుకోవాలని వివరించారు. సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి, ముగించాలని చెప్పారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, సకాలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు వరి సేకరణ పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. వాతావరణ పరిస్థితులు మారే అవకాశం ఉన్నందున రైతులకు నష్టం వాటిల్లకుండా నిర్ణీత గడువులోగా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్లు స్వయంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తూ, కొనుగోలు ప్రక్రియ సరిగ్గా జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, వరి పంట కోతకు స్పందించిన వివరాలపై అధికారులతో చర్చించారు. త్వరలోనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని తెలిపారు. ఎక్కడా కూడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా వరి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. గతంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు కలిగిన కేంద్రాల్లో మళ్ళీ ఇబ్బందులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా అన్ని సౌకర్యాలు కల్పించాలని వివరించారు. ఎక్కడా కూడా రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని పేర్కొన్నారు. తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు సరిగ్గా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని అన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన వేణారెడ్డి



సూర్యాపేట,భారతశక్తి ప్రతినిది,అక్టోబర్ 15:

సూర్యాపేట మండలంలోని పలు గ్రామలలో ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించాలి, మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైస్సార్, ఆర్డీఆర్ ల ఆలోచన మేరకు ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సన్నాలు పండిస్తున్న రైతులను ప్రోత్సహించడానికి క్వింటాకు 500 బోనస్ అందిస్తున్నట్లు గుర్తు చేశారు. రైతులకు ఉచిత కరెంట్, రుణ మాఫీ, రైతు భరోసా, 500 బోనస్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని తెలిపారు.

అందుకోసమే రాష్ట్రంలో సన్నాలు పండించే రైతులను ప్రోత్సహస్తుందని అన్నారు. దీనివల్ల మన రైతుల వద్దనే సన్నాలు కొని మళ్ళీ మనకే సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందువలన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే పంటను అమ్మాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియడం లేదని కావున కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. తేమ 17 శాతం ఉండాలని, బస్తా 41 కేజీలు మాత్రమే తూకం వేయాలని ఈ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐకెపి ఏపీఎం మైసయ్య, సీసీలు విజయభాను, యాదగిరి, మహిళా సంఘాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం పై కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్

## డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి అడ్లూరి

కరీంనగర్, అక్టోబర్ 15(భారతశక్తి):

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ప్రైవేటు పాఠశాల యాజమాన్యంవారి బడులలో చదివే విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులకు గురి చేయడానికి వీలు లేదని తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు ప్రభుత్వం చెల్లిస్తుందని డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన



శాఖ మంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలసి జిల్లా కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యాజమాన్యులతో సమావేశమై విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకుని రావాలని తెలిపారు.

సామాజిక బాధ్యతగా భావించి విద్యా రంగం పై ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం క్రమ పద్ధతిలో విడుదల చేస్తుందని స్పష్టం చేశారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లో జరుగుతున్న పాఠ్యాంశాల బోధన, వసతులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

ప్రైవేట్ స్కూల్స్ తో బెస్ట్ అవైలబుల్ స్కూల్ కింద ఎంఓయూ చేసుకునే సమయంలోనే ఫీజులకు సంబంధించిన అంశాలు ఉంటాయని యాజమాన్యాలకు తెలపాలని అన్నారు. స్కూలు యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలనీ తెలిపారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూకలెక్టర్లు జిల్లా విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుంటూ పాఠశాల యాజమాన్యులతో చర్చించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులతో సమావేశమైన చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి

ఆర్మూర్, అక్టోబర్ 15 (భారత శక్తి):

నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూరు నియోజకవర్గంలోని నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలోని మున్నూరు కాపు కళ్యాణ మండపంలో,ఆర్మూరు పట్టణంలోని సీ కన్వేషన్ హాల్ లో ఏఐసీసీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జిల్లా అధ్యక్షుల నియామకంలో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గం బి బ్లాక్ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు రిజ్వాన్ అర్షద్, పిసిసి ఆర్గనైజర్లు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, డా.రవి బాబు, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నియోజక వర్గ ఇంచార్జీ ప్రొద్దుటూరు వినయ్ రెడ్డి, ముఖ్య నాయకులు, అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకి నివాళులర్పించిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి...!

ఎల్బీనగర్, అక్టోబర్ 15 (భారత శక్తి):

దేశభక్తి, విజ్ఞానం, వినమ్రతకు ప్రతీక అయిన భారతరత్న డా. ఏపిజె.అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసినా కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించిన హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి..ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డాక్టర్ కలాం కేవలం శాస్త్రవేత్త



మాత్రమే కాదు, ఆయన దూరదృష్టి కలిగిన నాయకుడని,కలలు కనండి, వాటిని సాధించడానికి కృషి చేయండని ఆయన చెప్పిన మాటలు ఈరోజు కూడా ప్రతి భారత యువకుడి హృదయంలో మార్మోగుతున్నాయి. ఆయన చూపిన మార్గం మనందరికీ శాశ్వత ప్రేరణ అని అన్నారు.ఈ కార్యక్రమంలో చంపాపేట్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్ర యాదవ్, చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్ ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలి :మంత్రులు ఉత్తమ్,తుమ్మల

## రెండు మూడు రోజుల్లో రైతుల ఖాతాలో జమ

ములుగు జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15 (భారతశక్తి) : 8వేల342 కొనుగోలు కేంద్రాల ద్వారా 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు లక్ష్యంమని, అందుకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులను ఆదేశించారు.స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఏ రాష్ట్రం చేయని విధంగా రికార్డు స్థాయిలో వానాకాలం పంట కొనుగోలుకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి హైదరాబాద్ నుంచి వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు, ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు.

ఈ వీడియో సమావేశంలో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి తో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షలో మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశ చరిత్రలో అత్యధికంగా వరి పంట సాగు విస్తీర్ణం ప్రస్తుతం మన తెలంగాణ రాష్ట్రంలో జరుగుతుందని అన్నారు. రాబోయే వానా కాలం అత్యధికంగా పంట కొనుగోలు తెలంగాణ రాష్ట్రం చేయబోతుందని, దీనికి అవసరమైన ఏర్పాట్లు కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధతో చేపట్టాలని అన్నారు.గతంలో ఉన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ధాన్యం రవాణా కాంట్రాక్ట్ ఖరారు చేసే ముందు సరిపడ వాహనాలు సరఫరా చేసేందుకు అర్హత ఉందో లేదో ఒకటికి రెండు సార్లు పరిశీలించాలని మంత్రి సూచించారు. జిల్లాలో వరి కోతలు ప్రణాళికాబద్ధంగా జరిగేలా కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లాలో ప్రారంభించాలని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు, గన్నిబ్యాగులు, వెయింగ్, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, ఇతర సామాగ్రి సిద్ధం చేసుకోవాలని, కొనుగోలు సిబ్బందికి అవసరమైన మేర శిక్షణ అందించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎదురు చూసే పరిస్థితి రాకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ధాన్యం కొనుగోలు





చేసిన వెంటనే వివరాలు ట్యాబ్ ఎంట్రీ జరిగేలా సిబ్బంది నియమించుకోవాలని, 2025 వానాకాలం సీజన్ నందు ధాన్యం డబ్బులు 48 నుంచి 72 గంటలలోగా రైతుల ఖాతాలలో జమ చేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు బాగా జరుగుతుందని ప్రభుత్వానికి మంచి పేరు ఉందని, గత రెండు సంవత్సరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత సీజన్ మరింత మెరుగ్గా ధాన్యం కొనుగోలు చేసేందుకు కలెక్టర్లు ఏర్పాట్లు చేయాలని అన్నారు. వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుంటూ జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను వరి కోతల కంటే ముందుగానే ప్రారంభించాలని అన్నారు. దీపావళి తర్వాత వరి కోతలు వేగం కానున్న నేపథ్యంలో జిల్లా గన్ని బ్యాగులు, ధాన్యం రవాణా ఏర్పాట్లు, ధాన్యం సెంటర్ లలో ఇన్ ఫ్రా సౌకర్యాల కల్పన చర్యలు తీసుకోవాలని అన్నారు. క్రమ పద్ధతిలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చేలా చూడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు క్రమ పద్ధతిలో జరిగేలా జిల్లాల్లో ఏర్పాట్లు చేసి సన్నద్ధంగా ఉండాలని అన్నారు. 2025 వానాకాలంలో మన దగ్గర 66 లక్షల 80 వేల ఎకరాల్లో వరి పంట సాగు జరుగుతోందని, కోటి 48 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనాతో కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 8342 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 80 లక్షల మెట్రిక్ టన్నుల (40 లక్షల సన్న రకం, 40 లక్షల దొడ్డు రకం రకం) ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన వసతులు కల్పించాలని అన్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఒకే చోట కొనుగోలు చేస్తే రైతులకు స్పష్టంగా తెలిసేలా ప్రత్యేక కౌంటర్లు పెట్టాలని, సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా రవాణా చేయాలని అన్నారు.వీడియో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం సమయంలో స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, ప్రోటోకాల్ నిబంధనల ఉల్లంఘన జరగకుండా చూడాలని అన్నారు. జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద డ్రైయర్ లను ఏర్పాటు చేయాలని, అందుబాటులో ఉన్న మ్యానువల్ ప్యాడీ క్లీనర్లను కొనుగోలు కేంద్రాలకు కేటాయించాలని అన్నారు. టార్పాలిన్ కవర్లు ప్రతి కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో పెట్టాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో ఉన్న గ్రామ పరిపాలన అధికారులకు కొనుగోలు కేంద్రాల వద్ద విధులు కేటాయించాలని, దీనికి సంబంధించి ప్రోసిడింగ్స్ జారీ చేయాలని, గ్రామ పాలన అధికారుల ద్వారానే రిపోర్ట్ సేకరణ ఉంటుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్ని బ్యాగులను ముందస్తుగానే అందుబాటులో ఉంచాలని, 10 లక్షల గన్ని బ్యాగుల అదనపు కేటాయింపుల కోసం ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు వచ్చినా అధికారులు తన దృష్టికి తీసుకొని రావాలని, ధాన్యం కొనుగోలు వివరాలు ట్యాబ్ ఎంట్రీ త్వరగా జరగాలని, రైస్ మిల్లుల, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర హమాలీలు అందు బాటులో ఉండాలని అన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ప్రతిరోజు క్షేత్ర స్థాయి పురోగతి వివరాల రిపోర్టు రూపంలో అందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ శ్రీనివాసరావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి షా ఫైజల్ హుస్సేనీ, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ రాంపతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్, జిల్లా సహకార అధికారి సర్దార్ సింగ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హక్కులను కాపాడుకోవడానికి కార్మికులంతా సిద్ధంకావాలి: ఏఐటీయూసీ

ములుగు జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15 (భారతశక్తి) : జిల్లాలోని వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి, కనీస వేతనాలను సాధించుకోవడానికి కార్మికులంతా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ పిలుపునిచ్చింది.

ఏఐటీయూసీ ములుగు మండల మహాసభ గుంజ శ్రీనివాస్,పెద్ద కాసు వినోద్ ల అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ విశ్రాంత ఉద్యోగుల భవనంలో మంగళవారం నిర్వహించిన మహాసభలో ఏఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి, జంపాల రవీందర్ పాల్గొని మాట్లాడారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం,కార్పోరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా ఉండడానికి గాను, నాలుగు కోడ్స్ గా కుదించడం జరిగింది అన్నారు,అంటే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందో ప్రజలు,కార్మికులు,ఉద్యోగులు,ఆలోచన చేయవలసిన సమయం ఆసన్నమైంది అన్నారు, కనుక పై చట్టాలను రక్షించుకోవడానికి, కనీస వేతనాలు సాధించుకోవడం కోసం సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు,, దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు కార్మిక వర్గానికి సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని తీర్పు ఇచ్చినప్పటికీ, పాలకులు మాత్రం అమలు చేయడం లేదు అన్నారు, కనుక సుప్రీం కోర్టు, కేంద్ర ప్రభుత్వం పైన కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని కోరడం జరిగినది, కేంద్ర రాష్ట్ర,ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసే బదులు వాటిని ప్రభుత్వ రంగంలో నిర్వహిస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుంది అన్నారు, అలాగే కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ విధానాలను విరమించుకొని ప్రతి ఒక్కరిని ప్రభుత్వ ఉద్యోగులుగానే గుర్తించాలని ప్రభుత్వం ద్వారా అనే నేరుగా వేతనాలు చెల్లించాలని



స్కీం వర్కర్స్ అందరినీ రెగ్యులర్ చేయాలని కనీస వేతనాలు 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు ఇవన్నీ సాధించుకోవడం కొరకు అన్ని వర్గాల ప్రజలు కార్మికులు ఉద్యోగులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది జేఏటియుసి మండల అధ్యక్షులుగా పెద్దకాసు వినోద్ ప్రధాన కార్యదర్శిగా గుంజ శ్రీనివాసుల తోపాటు 22 మందిని ఎదుర్కోవడం జరిగినదిఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బండి నరసయ్య, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ములుగు జిల్లా అధ్యక్షురాలు సామల రమ, సిపిఐ సీనియర్ నాయకులు ఇంజన్ కొమురయ్య, ముత్యం కొమురయ్య, వీరన్న,శ్రవణ్,, కొత్తపెల్లి శ్రీనివాస్,అజిత, సంధ్య, లలిత, సంధ్య, నమత, గుండ్రెడ్డి శ్రీనివాస్, గుండె దీపిక,మల్రాజుల సమ్మయ్య,కమలక్క రమేష్,కుంకర స్వామి,కౌసల్య, శ్రీను, శిరీష, ప్రవీణ్,శ్రీకాంత్,జంపాల శ్రీనివాస్, ఎండి రంజాన్, నవ లోక,రజిత,లావుడే రాములు, కనక లక్ష్మి ఆసరి లక్ష్మి రాజకుమారి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# పేకాటపై ఉక్కుపాదం - భూపాలపల్లి టాస్క్ ఫోర్స్.

భూపాలపల్లి, భారత శక్తి,అక్టోబర్ 15: పేకాట దాడిలో 10 మందిని అరెస్ట్ చేసి, రూ. 50,500/- నగదు, 10 మొబైల్ ఫోన్లు, 52 ప్లేయింగ్ కార్డులు, ఒక ద్విచక్ర వాహనం మరియు ఒక షిఫ్ట్ డిజైర్ కారు స్వాధీనం

భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్స్ సీఐ రమేష్ బృందంతో కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడిచర్ల అటవీ ప్రాంతంలో దాడిని నిర్వహించడం జరిగింది. నమ్మదగిన సమాచారం ఆధారంగా జరిగిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ. 50,500/- నగదు, 10 మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, ఒక షిఫ్ట్ డిజైర్ కారు, మరియు 52 ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

తదుపరి చట్టపరమైన చర్యల కోసం నిందితులు మరియు స్వాధీనం చేసుకున్న వస్తువులు కొయ్యూరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించబడ్డాయి.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే, ఐపీఎస్ మాట్లాడుతూ జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. పేకాట, బెట్టింగ్ వంటి కార్యకలాపాల వలన అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా యువత తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో చెడు మార్గాలను ఎంచుకోవడం ఆందోళనకరం. కష్టపడి సంపాదించినదే నిలుస్తుంది. ప్రజలు ఇలాంటి సమాచారాన్ని పోలీసులకు అందించి సహకరించాలని" కోరారు.

# ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృత ఏర్పాట్లు:జిల్లా కలెక్టర్ ప్రావీణ్య


## ధాన్యం కొనుగోళ్ళపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రులు

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 15:

ఖరీఫ్ 2025-26 - వానాకాలం లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు.ఖరీఫ్ 2025-26 - ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లలో ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆయా జిల్లాల కలెక్టర్లు కు సూచించారు . ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు , బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం సేకరణ ప్రక్రియపై సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ సజావుగా జరగాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సంగారెడ్డి జిల్లా నుండి కలెక్టర్ పి ప్రావీణ్య , అదనపు కలెక్టర్ (రెవిన్యూ ) మాధురి , జిల్లా పౌరసరఫరాల శాఖ ,వ్యవసాయశాఖ ,సహకారశాఖ ,గ్రామీణాభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు . వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు . ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు . ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ముందుగా హార్వెస్టర్ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేయరాదని, ప్రతి మండలం, నియోజకవర్గానికి ప్రత్యేక అధికారులు, సూపర్వైజర్లు నియమించాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, వాతావరణ శాఖ రిపోర్టులను కేంద్ర నిర్వాహకులకు తెలియజేయాలనిఅన్నారు . జిల్లాలో వరి కొనుగోలు కంట్రోల్ రూమ్ , టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇతర జిల్లాల నుండి ధాన్యం రాకుండా ఇంటర్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓపీఎంఎస్ వ్యవస్థలో మిల్లుల ట్యాగింగ్ పనులు పూర్తి చేయాలని, పిపిసి సెంటర్ల నుండి నిర్ధారిత రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో తాగునీటి వసతులతో పాటు విద్యుత్ సౌకర్యం రైతుల విశ్రాంతి కోసం షెడ్ల ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాలకు దాన్యం తీసుకువచ్చే రైతులు సరియైన తేమ శాతం ఉండేలా చూడడంతో పాటు ధాన్యం తూర్పార బట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. తార్పాలిన్లు, ఆటోమేటిక్ వరి శుభ్రపరచే యంత్రాలు, పెద్ద/చిన్న వరి క్లీనర్లు, ధాన్య కొలమాన పరికరాలు తేమ కొలిచే మీటర్లు ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, పొట్టు తొలగించే యంత్రాలు , ఫీల్డ్ తూకం యంత్రాలు , మొబైల్ ఎండబెట్టే యంత్రాలు వంటి మౌలిక వసతులు కేంద్రాలలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులును ఆదేశించారు.ఈ సమావేశంలో డి.ఎం సివిల్ సప్లై అధికారి అంబదాస్ రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి బాల సరోజ, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్, పి.డి డిఆర్డిఏ జ్యోతి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు దీపిక,ప్రతిభ , తూనికలు కొలతల శాఖ అధికారులు,పోలీస్ శాఖ అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీ ప్రత్యేక శుభ్రత డ్రైవ్‌లో రికార్డు

## 10 రోజుల్లో 4,185 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు తొలగింపు





హైదరాబాద్, అక్టోబర్ 15 (భారత శక్తి):

నగరంలోని అన్ని 150 వార్డుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శుభ్రత డ్రైవ్‌లో భాగంగా, జీహెచ్ఎంసీ గత పది రోజుల్లో 4,185 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగించింది. ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ 6, 2025న కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మార్గదర్శకత్వంలో ప్రారంభించారు. ఈ డ్రైవ్ ముఖ్య ఉద్దేశ్యం నగరంలో సంవత్సరాలుగా పేరుకుపోయిన దీర్ఘకాలికంగా పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా తొలగించడం. ఇందులో మున్సిపల్ ఘన వ్యర్థాలు కన్స్ట్రక్షన్ అండ్ డెమలిషన్ (సీ అండ్ డి) వ్యర్థాలు ఉన్నాయి.. ఈ డ్రైవ్ ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుండి ఆరు జోన్లలో ఏకకాలంలో కొనసాగుతోంది.

ప్రధాన సాధింపులు(అక్టోబర్ 6%-15, 2025)

మొత్తం కాలనీలు శుభ్రపరిచినవి: 2,041

-ఎంఎస్‌డబ్ల్యూ వ్యర్థాలు తొలగించినవి: 3,215.25 మెట్రిక్ టన్నులు

- సి&డి వ్యర్థాలు తొలగించినవి: 970.2 మెట్రిక్ టన్నులు

-మొత్తం తొలగింపు: 4,185.45 మెట్రిక్ టన్నులు

- వాహన ప్రయాణాలు: 756.5 (ఎంఎస్డబ్ల్యూ ) %డ% 143 (సీ అండ్ డి)

- సగటు రోజువారీ శుభ్రత: 418.5 మెట్రిక్ టన్నులు

చార్మినార్ జోన్ 967 మెట్రిక్ టన్నులతో అగ్రస్థానంలో నిలిచింది. దాని తరువాత ఖైరతాబాద్ (907.4 ఎంటీ), ఎల్.బి.నగర్ (551.25 ఎంటీ), కూకట్‌పల్లి (482.1 ఎంటీ), సికింద్రాబాద్ (359 ఎంటీ), శేరిలింగంపల్లి(119.1 ఎంటీ) జోన్లు ఉన్నాయి.

పర్యవేక్షణ, వ్యూహాత్మక చర్యలు

ప్రతి వార్డు స్థాయిలో వ్యర్థాల నిల్వ ప్రాంతాలను జీపీఎస్ ట్యాగింగ్ ద్వారా మ్యాప్ చేసి, వాహనాల మార్గాలను సక్రమంగా ప్లాన్ చేశారు. ఎంఎస్‌డబ్ల్యూ మరియు సి%డ%డి బృందాలు కలసి పనిచేస్తూ, భారీ మలినాల తొలగింపుకు జేసీబీలు, బాబ్‌క్యాట్లు ఉపయోగిస్తున్నారు. ఎలక్ట్రిసిటీ విభాగం సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల దగ్గర భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిరోజూ రియల్‌టైమ్ డిజిటల్ రిపోర్టింగ్, జీపీఎస్ ట్యాగ్ చేసిన ఫోటోలు ఆధారంగా పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. హెల్త్, శానిటేషన్ విభాగాల సంయుక్త కమిషనర్లు ప్రతి రోజు సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ప్రజా సహకారం - ఆరోగ్య పరిరక్షణ

ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా అనేక ప్రాంతాల్లో శుభ్రతా స్థాయి గణనీయంగా మెరుగుపడింది. ఆరోగ్య ప్రమాదాలు తగ్గాయని, వాయు నాణ్యత మెరుగైంది. ప్రజలు సానుకూలంగా స్పందిస్తూ, శానిటేషన్ సిబ్బందికి సహకరించడంతో పాటు, అదనపు వ్యర్థాల నిల్వ ప్రాంతాల సమాచారం అందిస్తున్నారు. అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యూసీడీ) విభాగం ద్వారా రీసోర్స్ పర్సన్లు (ఆర్పిస్) వార్డు స్థాయిలో గ్యార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల (జీవీపీఎస్) క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, చిన్న, పెద్ద వ్యర్థాల కేంద్రాలను శుభ్రం చేస్తున్నారు. ఈ డ్రైవ్ విజయం పౌరులూ, శానిటేషన్ సిబ్బందీ కలసి చేసిన కృషికి నిదర్శనం. నగరాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, ఎక్కడైనా దీర్ఘకాలికంగా పేరుకుపోయిన వ్యర్థాలు గమనిస్తే సంబంధిత వార్డు కార్యాలయానికి తెలియజేయాలి. జీహెచ్ఎంసీ ప్రతిరోజూ అన్ని 150 వార్డులను కవర్ చేస్తూ ఈ ప్రత్యేక శుభ్రత డ్రైవ్‌ను కొనసాగిస్తోంది. నగరంలోని ప్రతి వార్డు వంద శాతం శుభ్రత లక్ష్యాన్ని చేరేవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

# సంగారెడ్డి జిల్లా భరోసా 5 వ వార్షికోత్సవం

- ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా ఎస్పీ
- మహిళల, బాలికల భద్రతకు సంగారెడ్డి జిల్లా భరోసా పెద్దపీట
- మహిళలు, పిల్లలు మౌనం వీడి, నిర్భయంగా ముందుకు రండి, వేధింపుల నుండి బయటపడండి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 15:

భరోసా 5వ వార్షికోత్సవ కార్యక్రమంలో భరోసా సిబ్బంది సేవలను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ మాట్లాడుతూ మహిళలు, బాలల రక్షణ కోసం ప్రారంభించిన సంగారెడ్డి జిల్లా భరోసా సెంటర్ 28-ప్టెంబర్-2025 నాటికి విజయవంతంగా 5 సంవత్సరాలు పూర్తి చేసుకుందని, పోక్సో, అత్యాచార కేసులలో మహిళలు, బాలలకు మానసిక, చట్టపరమైన సహాయం అందించడంలో, న్యాయ సలహాలు ఇవ్వడంలో భరోసా సెంటర్ కీలకపాత్ర పోషించిందని, సిబ్బంది సేవలను ఎస్పీ అభినందించారు. మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలను దృష్టిలో ఉంచుకొని, అన్ని రకాల సేవలను ఒకే గొడుగు క్రింద అందించాలన్న సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ డిజిపి ఆద్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో 28-సెప్టెంబర్-2020 న ప్రారంభమైన భరోసా సెంటర్ గడిచిన ఐదు సంవత్సరాలు పోక్సో, అత్యాచార కేసులలో భాదిత మహిళలకు అన్ని రకాల సేవలందిస్తూ, జిల్లా ప్రజల మన్ననలు పొందడం జరుగుతుంది అన్నారు. భరోసా సెంటర్ నందు శిక్షణ పొందిన సిబ్బంది, భాదిత మహిళలను అక్కున చేర్చుకొని వారిలో కొండత ధైర్యాన్ని నింపుతూ సమస్యలతో భరోసా సెంటర్ కు వచ్చిన వారికి నిష్ణాతులైన కౌన్సర్ లచే కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు, పోక్సో మరియు అత్యాచార కేసుల్లో భాదిత మహిళలకు అన్ని రకాల సేవలు (మెడికల్, లీగల్ మరియు కాంపెన్సేషన్) ఒకే వేదికగా అందిస్తూ, భాదితులకు బాధ నుండి విముక్తి కల్పిస్తూ సత్వర న్యాయం చేకూరేలా సేవలందిస్తున్న భరోసా సిబ్బంది సేవలను ఎస్పీ గారు కొనియాడారు. భరోసా సేవలు: గడిచిన 5 సంవత్సరాల నుండి ఇప్పటివరకు నమోదైన 657 పోక్సో మరియు అత్యాచార కేసుల్లో మెడికల్, లీగల్ సేవలను అందించడంతో పాటు 407 కేసులలో రూ:1,73,59,500/- కాంపెన్సేషన్, 24 మందికి మిషన్ వాత్సల్య స్కాలర్ షిప్ రూ: 6,40,0000/-, తక్షణ పరిహారంగా డి.ఎల్.ఎస్.ఎ నుండి ఒక లక్ష రూపాయలను, విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్ క్రింద 50 మందికి రూ: 2,83,000/-




ఇప్పించడం జరిగిందన్నారు.

భరోసా సెంటర్ ద్వారా పోక్సో మరియు మహిళల పై అత్యాచార కేసులను నియంత్రించడానికి స్కూల్, కళాశాల లలో తరుచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. పోక్సో కేసు నమోదు అయినప్పటి నుండి చివరి వరకు బాధితులకు అండగా వుంటూ, నేరస్తులకు శిక్ష పడేలా చేయడమే భరోసా ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. తమకు జరిగిన అన్యాయం గురించి నిర్భయంగా ముందుకు వచ్చి ఫిర్యాదు నమోదు చేయాలని, న్యాయస్థానం ముందు దోషులకు శిక్ష పడినప్పుడే తిరిగి నేరం చేయడానికి వెనకడుగు వేస్తారని ఎస్పీ అన్నారు. భరోసా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి అలసత్వం చూపరాదని, రాత్రి పగలు అని తేడా లేకుండా ఎళ్లవేలలా పిల్లల, మహిళల రక్షణకు అందుబాటులో ఉండాలని సూచించారు. బాధితులకు ఎలాంటి అసౌకర్యం కలగనీయకుండా అన్ని డిపార్ట్మెంట్ అధికారులతో కోఆర్డినేషన్ తో విధులు నిర్వహించాలని అన్నారు. జిల్లా పోలీసు శాఖ నుండి ఎల్ల వేళలా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో భరోసా నోడల్ అధికారి/ అదనపు.ఎస్పీ రఘునందన్ రావ్, సంగారెడ్డి డిఎస్పీ సత్యయ్య గౌడ్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్, ఎస్ఐ పూలబాయ్, జిల్లా ఇన్స్పెక్టర్స్ భరోసా కో-ఆర్డినేటర్ దేవ లక్ష్మీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బకాయిలు వెంటనే విడుదల చేయాలి

## ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ గిరిజన సంఘాల ధర్నా

కరీంనగర్, అక్టోబర్ 15(భారతశక్తి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బెస్ట్ అవలేబుల్ స్కీం కింద పెండింగ్లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయం బుధవారం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగర రజినీకాంత్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి తిప్పరపు సురేష్ లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 180 కోట్ల బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం బకాయి డబ్బులు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యార్థుల తల్లిదండ్రులతో కలుపుకొని ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడం వలన పాఠశాలల యాజమాన్యాల నిర్వహణ ఖర్చులు పెరిగి ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు చదువుకొనే బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా నాణ్యమైన చదువులు అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దూరం చేయొద్దని నాయకులు హెచ్చరించారు. తక్షణమే పెండింగ్లో ఉన్న బకాయిలు విడుదల చేయకుంటే ప్రజాపాలన అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యార్థి లోకం సామాజిక సంఘాలు తల్లిదండ్రుల నుండి ప్రత్యక్ష ఆందోళన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్.

గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి సాగర్ నగర అధ్యక్షుడు పులిపాక సాయికుమార్ జిల్లా సహాయ కార్యదర్శి కండె రాజు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అసంపల్లి వినయ్. జిల్లా సహాయ కార్యదర్శి బొగేశ్, నాయకులు రోహిత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

-ప్రతి విద్యార్థికి మంచి ఆశయం,లక్ష్యం ఉండాలి

-డ్రగ్స్, సైబర్ మోసాల నివారణలో విద్యార్థులు యువత ఇతరులకు అవగాహన కల్పించాలి

-సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట, భారత శక్తి ప్రతినిధి,అక్టోబర్ 15:చెడు వ్యసనాలకు విద్యార్థులు యువత దూరంగా ఉండాలని అదేవిధంగా భవిష్యత్తులో మంచి లక్ష్యాలను కలిగి వాటిని సాధించే విధంగా తమ జీవితాన్ని కొనసాగించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం లో భాగంగా బుధవారం పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ ప్రజాభరోసా అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శాంతి భద్రతలు, చట్టాలు, మంచి ప్రవర్తన, విద్యార్థి ఉన్నత లక్ష్యాలు, పట్టుదలతో కృషి చేయడం, విజయాలు గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని ఆయన జీవితం గురించి కలాం సాధించిన విజయాలు, అతను దేశానికి చేసిన సేవ, కృషి గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలని అబ్దుల్ కాలం ని స్పూర్తిగా తీసుకోవాలని ఆశయ సాధన కోసం కృషి చేస్తేనే విజయాలు వస్తాయని తెలిపారు. పాఠశాలలో మనం ఎందుకు ఉన్నాము అనేది గుర్తుంచుకోవాలి, చదువు చాలా విలువైనది ప్రపంచంలో చదువుతోనే విజ్ఞానం వెలుగోందుతుంది అన్నారు. మనకు విజ్ఞానాన్ని, తెలివిని, మంచి నడవడికను విద్యాలయాలు నేర్పిస్తాయి, విద్యార్థికి తరగతి గది ఒక ప్రయోగశాల అన్నారు. బాగా చదివి ప్రయోజకులు కావాలి, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యం కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు. అవకాశాలు లేని రోజుల్లో మంచి విజయాలు సాదించిన గొప్పవాళ్ళు ఉన్నానుఅలాంటి వారి విజయగధాలను ఆదర్శంగా తీసుకోవాలి అని అన్నారు. బాలికలు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరాలని అన్నారు, సమాజంలో ఎన్నో రుగ్మతలు ఉన్నాయి వాటి నిర్మూలనకు చదువు మార్గం అన్నారు. ప్రావీణ్యం ఉన్న అంశంలో కృషి చేయాలి, ఆటలు ఆడాలి, శారీరకంగా దృఢంగా ఉండాలి అని కోరారు. భేటీ బచావో - భేటీ పడావో నినాదంతో బాలికల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి, బాలికలను ఎదగనివ్వాలి అని కోరారు. బాల్య వివాహాలు చేయవద్దు అని కోరారు. విద్యార్థులు చిన్నచిన్న సమస్యలకు ఒత్తిడికి లోనై, ఆకర్షణలకు లోనై బంగారు జీవితాన్ని భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దు ఆత్మహత్య లాంటివి చేసుకోవద్దు అని కోరారు. చెడు అలవాట్లకు లోను కావద్దు మంచి పుస్తకాలను మంచి స్నేహితులను ఏర్పాటు చేసుకోవాలి, కష్టపడి చదివి తల్లిదండ్రులకు చదువు చెప్పిన గురువులకు పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. ఏ రకంగా నైనా వేధింపులు జరుగుతున్న తెలిసినవాళు బంధువులు ఎవరైనా చెడు బుద్ధితో శరీరాన్ని తాకుతున్నట్లు గ్రహించిన వెంటనే తల్లిదండ్రులకు లేదా గురువులకు తెలియజేయాలి, ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి అని అన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ మోసాలు మాదకద్రవ్యాలు అతిపెద్ద సమస్యగా ఉన్నాయని వీటిపై విద్యార్థులు ఫ్రంట్ వారియర్స్ లాగా పనిచేసే పెద్దలకు అవగాహన కల్పించాలని సూచించారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే వాటికి ప్రభావితం కావొద్దు అని ఇంటర్నెట్ నుంచి జ్ఞాన సముపార్జనకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం నందు సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు,ఎస్సై లు,కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రెజ్లర్ జస్వంత్ కు రాచకొండ సిపి అభినందన

## మరిన్ని పథకాలు సాధించాలి

ఎల్బీనగర్, అక్టోబర్ 15 (భారత శక్తి):



హరియాణాలోని మధుబన్ కర్నాల్లో సెప్టెంబర్ 20 నుండి 24 వరకు జరిగిన 74వ ఆల్ ఇండియా పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ విభాగం 2025-26 పోటీల్లో బ్రాంజ్ పతకం గెలిచిన తెలంగాణ పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ జట్టు సభ్యుడు రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఐటీ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో కానిస్టేబుల్ గా పని చేస్తున్న జశ్వంత్ ను బుధవారం రాచకొండ సిపి సుధీర్ బాబు ఐపిఎస్ నేరేడ్ మెట్ కార్యాలయంలో అభినందించారు.

# కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశమైన చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి

బాల్కొండ, అక్టోబర్ 15 (భారత శక్తి):

ఏఐసీసీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జిల్లా అధ్యక్షుల




నియామకంలో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ నియోజకవర్గానికి చెందిన ఎ అండ్ బి బ్లాక్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు రిజ్వాన్ అర్షద్, పిసిసి ఆర్గనైజర్లు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, డా.రవి బాబు, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నియోజక వర్గ ఇంచార్జీ ముత్యాల సునీల్ కుమార్, ముఖ్య నాయకులు, అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# వెటర్నరీ అధికారులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలి

## ఉచిత గాలికుంటు టీకా కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

భారత శక్తి,యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 15: ప్రభుత్వ వెటర్నరీ అధికారులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని చోల్లేరు గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు టీకా కార్యక్రమంలో బీర్ల అయిలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీకా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం రైతుల యొక్క పశువుల కోసం మందులు అందజేశారు. రైతులకు వ్యవసాయానికి వెన్నుముకగా ఉంటున్న పశువులను సంరక్షించడం మన బాధ్యత అని తెలిపారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత గాలి కుంటు వ్యాధి టీకాను రైతులందరూ తమ పశువులకు వేయించాలని సూచించారు. మన ప్రాంత రైతులు వ్యవసాయంతో పాటు డైరీ మీద ఎక్కువ ఆధారపడుతున్నారని కావున వెంటర్నరీ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు ఏ



సమ్యా వచ్చినా సకాలంలో స్పందిచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు, గ్రామ మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి, రైతులు పాల్గొన్నారు.

# పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)అక్టోబర్15: హనుమకొండ జిల్లాలోని వడ్డేపల్లి ప్రాథమిక పశువైద్య కేంద్రంలో బుధవారం (అక్టోబర్ 15 వ తేదీన) స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య, నాయిని రాజేందర్ రెడ్డి శాసనసభ్యులు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ప్రారంభించారు. పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య మాట్లాడుతూ దేశమంతటా 2019 నుండి ఈ వైరస్ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం కోసం ప్రతీ రాష్ట్రంలో ఈ టీకాలను ఆరు నెలలకు ఒకసారి ప్రతీ పశువుకు వేయడం ద్వారా, ఈ వ్యాధి పూర్తిగా నిర్మూలించవచ్చు అని తెలిపారు. మూగజీవుల ఇబ్బందులను, వాటికి కావలసిన అవసరాలను పశు వైద్య సిబ్బంది చెబితే వాటిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కావాల్సిన ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మీ పశువులన్నింటికీ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకొని విలువైన పశు వులను కాపాడుకుందాం - గాలికుంటు వ్యాధి రహిత రాష్ట్రంగా గుర్తింపు పొందుదాం అని చెప్పారు. ఈ వైరస్ వ్యాధి వ్యాపించిన పశువులలో అధిక జ్వరం రావడం, నోటిలో మరియు డెక్కల మధ్య పుండ్లు ఏర్పడి పశువులు మేత మేయకపోవడం వల్ల రోజు రోజుకు క్షీణించి, పాల దిగుబడి తగ్గి రైతుకు నష్టం కలుగుతుంది, కొన్ని



పశువులు మేత మేయకపోవడం వల్ల చనిపోతాయని ఉమ్మడి వరంగల్ జిల్లా జంతు వ్యాధుల నిర్ధారణ ల్యాబ్ - సహాయ సంచాలకులు డాక్టర్ నాగమణి రైతులకు అవగాహన కల్పించారు. అన్ని గ్రామాలకు పశు వైద్య సిబ్బంది వచ్చి ఈ టీకాలను అక్టోబర్ 15 వ తేదీ నుండి నవంబర్ 14 వరకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పశువులకు ఉచితంగా వేస్తుంది, కావున ప్రతి రైతు వారి పశువులన్నింటికీ టీకాలు వేసుకోవలెను. దీని ద్వారా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. మూడు నెలలు దాటిన ప్రతి పశువుకు వేసుకొని రైతులందరూ ఈ టీకాల కార్యక్రమమును సద్వినియోగం చేసుకోగలరని జిల్లా పశు వైద్య , పశుసంవర్ధక అధికారి డాక్టర్ రాధా కిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలోవడ్డెపల్లి పశు వైద్యాధికారి డా. ప్రవీణ్ కుమార్ , డాక్టర్ రాధా కిషన్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నాగమణి, డాక్టర్ వినయ్, డాక్టర్ కరుణాకర్ రెడ్డి, సిబ్బంది యాదలక్ష్మి, ఆకేష్, వంశీ లు పాల్గొన్నారు.

# తాడ్వాయి మండల కేంద్రంలోని దేమి కలాన్ గ్రామములో పాడి పశువులకు గాలికుంటూ టీకాల కార్యక్రమం

కామారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 15: తాడ్వాయి మండలం దేమి కలాన్ గ్రామములో పాడి పశువులకు గాలికుంటూ టీకాల కార్యక్రమాన్ని శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవితేజ ప్రారంభించారు . ఈ కార్యక్రమములో ఆయన మాట్లాడుతూ, 7వ విడత గాలి కుంటూ నివారణ టీకాలను పాడిరైతులు తమ పశువులకు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. లేనిచో రోగం వస్తే పశువులలో పాలదిగుబడి గణనియంగా తగ్గి, పశువు పునరుత్పత్తి సామర్థ్యం దెబ్బతింటుందని తెలిపారు. నేటి నుండి 14-11-2025 వరకు జిల్లాలోని అన్ని గ్రామాలలోని పశువులకు పశు సంవర్ధక శాఖ సిబ్బంది టీకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.



అదేవిదంగా జిల్లా పశువైద్యా, పశు సంవర్ధక శాఖ అధికారి డా. భాస్కరన్ మాట్లాడుతూ, గాలికుంటూ రోగం వస్తే పశువులకు కాళ్ల గెటికెలో, నోట్లో పుండ్లు అవడం వలన పశువు మేత మేయక పాల ఉత్పత్తి తగ్గడం గాని, చనిపోయే ప్రమాదం కూడా ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమములో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి డా. రమేష్, పోచయ్య,విఎల్ఓ, బి. కొండల్ రెడ్డి, జెవిఓ, ప్రేమ్ సింగ్ జెవిఓ, గోపాల మిత్రలు, విజయ డైరీ డైరెక్టర్ మైసగౌడ్, సెక్రటరీ అనిల్ రెడ్డి, పాడిరైతులు పాల్గొనడం జరిగింది.

# రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ, ఇరిగేషన్, మత్స్య, క్రీడల మంత్రులతో ధాన్యం కొనుగోళ్లు పై వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 15: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకాటి శ్రీహరి, సిఎస్ రామకృష్ణా రావు ఇతర ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై బుధవారం ఉదయం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశనం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్యాడి వినియోగం తెలంగాణలో ఎక్కువగా ఉందని, భారత దేశంలో ఎక్కువ ఖరీఫ్ ప్రొక్యూర్మెంట్ ఉంటుందని అన్నారు. ఇందుకొరకు అధికారులు అప్రమత్తం గా ఉండాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కొరకు ఏర్పాట్లు చేసుకోవాలని, ట్రాన్స్పోర్ట్ సమస్యలు తలెత్తకుండా కలెక్టర్ , ఎస్పీలు జాగ్రత్తలు తీసుకోవాలని, జిల్లాలో అవసరం మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో గన్నీ, ప్యాడీ క్లీనర్లు, మాయిచర్ మిషన్లు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు తదితరాలు అందుబాటులో ఉండేలా చూడాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైతే పై అధికారులను గాని సంబంధిత మంత్రులను గాని సంప్రదించాలని సూచించారు. గత రెండు పంటల కొనుగోలు కేంద్రాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అదే తరహాలో ఇప్పుడు కూడా కొనుగోలు జరిగేలా చూడాలని కోరారు. మిల్లర్లు సమస్యలు సృష్టించకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఎంఎస్పీ, బోనస్ అందించడానికి సిద్ధంగా ఉందని, అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ట్యాబ్ ఎంట్రీ జరిగేలా చూడాలని ఆదేశించారు. క్వాలిటీ ప్రకారం



కొనుగోలు జరగాలని, ఎఫ్సిఐ లతో పాటుగా ప్రైవేట్ గోడౌన్ లను అవసరాన్ని బట్టి వినియోగించుకోవాలని సూచించారు.

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, దేశంలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని, ఇప్పటి వరకు పద్దతి ప్రకారం, ఎలాటి సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని, అదే విధంగా ఇప్పుడు కూడా సక్రమంగా ఏ రోజుకారోజు ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు చేయడంలో సమస్యలు లేకుండా అవసరాన్నిబట్టి ముందుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించుకోవాలని, అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా కేంద్రాల వద్ద అన్ని అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, రైతులు కుర్చోడానికి మంచినీటి సమస్యలు రాకుండా చూడాలని, దీపావళి పండుగ తరువాత మొక్క జొన్న, సోయా పంటలను కూడా వస్తాయి కాబట్టి అధికారులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రతినిధులతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ సమావేశం నిర్వహించి జిల్లాలో మొత్తం 5.98 లక్ష మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వచ్చే అవకాశం ఉందని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిగా ఎత్తైన, సురక్షిత ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలి. నీరు నిలిచే, వరద ముంపు లేదా తక్కువ నేల ప్రాంతాల్లో పిపిసి నిర్వహించరాదని, అన్ని పిపిసి లలో తార్పాలిన్లు, మాయిశ్చర్ మీటర్లు, ఎలక్ట్రానిక్ వెయింగ్ స్కేల్స్, డిజిటల్ గ్రెయిన్ కాలిపర్స్, హస్క్ రిమూవర్స్, పడ్డి క్లీనర్లు, డ్రైయర్లు మరియు పవర్ బ్యాకప్ వంటి అవసరమైన మౌలిక వసతులు పూర్తిగా సిద్ధం చేయాలని,రైతులకు అనుకూలంగా నీడ, తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే వసతులు మరియు సరిపడా హమాలీ కార్మికులు అందుబాటులో ఉంచాలనీ, %ూాదీ% ద్వారా డేటా ఎంట్రీ వేగంగా పూర్తి చేసి, రైతులకు చెల్లింపులు 48 నుండి 72 గంటల్లోపే బ్యాంకు ఖాతాలలో జమ అయ్యేలా చూడాలనీ, మెరుపులు, అనుకోని వర్షాలు లేదా గాలివానల కారణంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పిపిసి వద్ద ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల వారీగా పంట కోత పర్యవేక్షణ చేసి, పిపిసి ల వద్ద ఒకేసారి రద్దీ కాకుండా చర్యలు తీసుకోవాలనీ , ప్రమాణాల ప్రకారం వరి నాణ్యత ధృవీకరణ చేయాలనీ, రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలనీ, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో సమన్వయం చేసి స్టాక్ నిల్వ లేకుండా పిపిసిల నుండి సమయానుకూలంగా ధాన్యం సరఫరా చేయాలని అన్నారు. హార్వెస్టర్ యంత్రాల యజమానులతో సమావేశం నిర్వహించి, కోత విధానాలను పాటించాలని సూచించాలనీ పంట నష్టం లేకుండా ఉంటుందని అన్నారు. జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్: 08468 ౨ 220051, రాష్ట్రస్థాయి టోల్ ఫ్రీ నంబర్లు 1800 4250 0333, 1800 4250 1967 నెంబర్లను రైతుల సంప్రదించాలని అన్నారు.

ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, డిఆర్డిఓ సురేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వరరావు, డిఎం సివిల్ సప్లై శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు సిపిఆర్ పై అవగాహనుండాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

## శిక్షణలో సిపిఆర్ చేసే పద్ధతిని చూపించిన వైద్యులు

కరీంనగర్, అక్టోబర్ 15(భారతశక్తి):

గుండెపోటు సమయంలో అవలంబించవలసిన సిపిఆర్ (కార్డియో పల్మనరీ రెసిసికేషన్) పద్ధతిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం



ఈనెల 13 నుండి 17 వరకు సిపిఆర్ అవగాహన వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి సిపిఆర్ పై శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుండెపోటు సంభవించిన సమయంలో మొదటి కొన్ని గోల్డెన్ సెకండ్లు వృధా చేయొద్దని అన్నారు. ఈ సమయంలో సిపిఆర్ చేసినట్లయితే ప్రాణాన్ని రక్షించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ మధ్యకాలంలో వయసుతో నిమిత్తం లేకుండా గుండెపోటు సంభవిస్తుందని, అందువల్ల ప్రతి ఇంట్లోనూ కుటుంబ సభ్యులకు కూడా సిపిఆర్ పై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. ప్రతి వ్యక్తికి సరైన పద్ధతిలో సిపిఆర్ విధానం తెలియాలని అన్నారు. ఈ సందర్భంగా సిపిఆర్ సమయంలో చేయవలసిన, చేయకూడని పనులను గురించి వైద్యులు డెమో ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల అడిషనల్ డీఎంఈ తక్కుద్దీన్ ఖాన్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంవో నవీన, ప్రోగ్రామ్ ఆఫీసర్ సనా, డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని పరామర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)అక్టోబర్15:

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని బుధవారం పరామర్శించారు. దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ ఇటీవల మరణించగా కాజీపేట ప్రశాంత్ నగర్ సమీపంలోని పిజిఆర్ గార్డెన్ లో మాతృ యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,



రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, రఘువీర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, ఇతర ప్రముఖులు హాజరు కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తదితరులు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

హెలికాప్టర్ లో హైదరాబాద్ నుండిలి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ని పరామర్శించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా హనుమకొండ సుబేదారి లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద దిగారు. దొంతి మాధవ రెడ్డి ని పరామర్శించేందుకు హెలికాప్టర్ ద్వారా ఆర్ట్స్ కళాశాల మైదానానికి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి కి రాష్ట్ర మంత్రి అనసూయ సీతక్క, ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, యశస్విని రెడ్డి, కే ఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పుష్ప గుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఆర్ట్స్ కళాశాల మైదానం నుండి రోడ్డు మార్గం లో పీజీఆర్ గార్డెన్ లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృ మూర్తి దొంతి కాంతమ్మ మాతృ యజ్ఞం కార్యక్రమం లో పాల్గొన్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే లు దొంతి కాంతమ్మ చిత్రపటం వద్ద పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు మాట్లాడారు. ఎమ్మెల్యే మాధవ రెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్ట్స్ కళాశాల మైదానానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు చేరుకున్నారు.

తిరిగి హైదరాబాద్ కు హెలికాప్టర్ లో బయలుదేరిన సీఎం, తదితరులులి


వరంగల్ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ని పరామర్శించిన అనంతరం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుండి హెలికాప్టర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి బయలుదేరారు. హెలిపాడ్ వద్ద మంత్రులు అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే లు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్. నాగరాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

# తడి గుడ్డతో గొంతు కోస్తున్న కిలాడి రాణి
# అరుణ కుమారి తాడిపత్రి

**చూడగానే అట్రాక్ట్ చేస్తుంది.. కళ్ళతోనే కవ్విస్తుంది.. ఎంతో చక్కగా మాట్లాడుతుంది.. కల్లబొల్లి కబుర్లు చెబుతుంది.. ఈజీగా నమ్మిస్తుంది.. అరచేతిలో స్వర్గం చూపిస్తుంది.. ఆమె అందం వెనుక తడిగుడ్డతో గొంతు కోసే కుతంత్రాలు దాగి ఉన్నాయి..మీకు మతిపోయే ఈవెంట్లు నిర్వహిస్తుంది.. టీవీ, సినీ, జబర్దస్త్ లాంటి కామెడీ షో ఆర్టిస్టులను, ప్రముఖ యాంకర్లను ఎంగేజ్ చేస్తుంది.. అదిరిపోయే కార్యక్రమాలు నిర్వహిస్తుంది.. తన కంపెనీని ప్రమోట్ చేస్తుంది.. పెట్టుబడిదారులను ఆకర్షిస్తుంది.. అమాయకులకు వలవేస్తుంది.. డబ్బులు వసూలు చేయడం.. ఆ డబ్బులతో పలు ప్రాంతాల్లో అంటే నాగార్జున సాగర్, గుంటూరు, మాచెర్ల లాంటి ప్రదేశాల్లో భూములు కొంటున్నాం.. అక్కడ విల్లాలు, అపార్టుమెంట్లు, రిసార్టులు, ఆర్గానిక్ ఫార్మింగ్ చేస్తున్నాం.. దానిమీద అత్యధిక లాభాలు గడిస్తాం.. మీకు వాటాలు ఇస్తాం.. పెట్టిన పెట్టుబడికి రెట్టింపు లాభాలను అందిస్తాం అని అందమైన అబద్ధపు మాటలు చెబుతుంది.. ఒకవేళ మీరు పెట్టుబడి పెడితే మీరు పెట్టిన డబ్బులకు 2 నుంచి 4 శాతం వరకు వడ్డీలు కూడా ఇస్తామని చెబుతుంది.. ఆమె వలలో చిక్కుకుని డబ్బులు చెల్లించారా.. ఫినిష్.. మీరు కోలుకోవడం కష్టం.. అదే కాకుండా మీ అమౌంట్ కి సమానమైన ల్యాండ్ ను మీ పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తానని చెబుతుంది.. ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఇలా ఎంతో మందిని నిలువునా ముంచేసి.. బిచాణా ఎత్తేసింది.. కన్నింగ్ కిలేడీ అరుణ కుమారి మోసపూరిత చరిత్ర మీకోసం..**



అరుణకుమారి పుత్రరత్నం తరుణ్ గోపి తాటిపత్రి
అరుణ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్



మాధురి రెడ్డి (చిన్ని) పల్నాడు
అరుణ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అరుణకుమారి మోసానికి సహకరించిన పర్సనల్ సెక్రెటరీ,




**( స్పెషల్ కరస్పాండెంట్ )**

**హైదరాబాద్, అక్టోబర్ 15 (భారత శక్తి) :** మహానగరంలో నిశ్శబ్దంగా మొదలైన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారం--- ఇప్పుడు వేలాదిమంది అమాయకుల కడుపు మంటకు కారణం అయ్యింది.. "అరుణా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్" పేరుతో అద్భుతమైన జిమ్మిక్కులతో ఆడిన ఈ గేమ్ వెనుక వున్నది ఒక అందమైన మహిళ అన్నది నమ్మలేని నిజం.. అందంగా కనిపించే ఆడ రాక్షసి ఈమె.. ఈవిడ ధనదాహానికి ఎందరో అమాయకులు బలైపోయారు..






తాడిపత్రి అరుణ కుమారి అందం, ఆకర్షణ, మాయమాటలు.. ఇవన్నీ ఈమెకు ఆయుధాలు.. కానీ లక్ష్యం మాత్రం ఒక్కటే--- అమాయకుల కష్టం దోచుకోవడం కోట్లు కొల్లగొట్టడం..

అధిక లాభాల మాయాజాలంలో ముంచేస్తుంది.. "రెట్టింపు లాభాలు, నెలకు 4 శాతం వడ్డీ, భూమిని సెక్యూరిటీగా రిజిస్టర్ చేస్తాం" ఇవి అరుణ కుమారి నిత్యం చెప్పే మంత్రాలు. "నాగార్జునసాగర్, మాచర్ల, గుంటూరు" ప్రాంతాల్లో విల్లాలు, రిసార్టులు, ఆర్గానిక్ ఫార్మ్స్, హోటల్స్ నిర్మిస్తామంటూ కహానీలు చెబుతూ పెట్టుబడిదారులను తన వలలో వేసుకుంది..

కొంతకాలం వడ్డీ చెల్లింపులు చేస్తూ అమాయకుల నమ్మకాన్ని పొందింది.. ఆ తరువాత.. ఫోన్లు స్విచ్ ఆఫ్, ఆఫీస్ గేట్లు మూసి, డైరెక్టర్లు కూడా జంప్.. ఈవిడ చేసిన మహా మాయకు తెరలేపిన ఈవెంట్లు.. ఈమెకున్న ఉన్న విస్తృత పరిచయాలతో సినీ, టీవీ, జబర్దస్త్ ఆర్టిస్టులు, యాంకర్లు, సింగర్స్‌తో భారీ ఈవెంట్లు---కళ్ళు చదిరే స్టేజ్ షోలు, లగ్జరీ హోటల్ లో లాంచింగ్‌లు చేసింది.. ఈ దెబ్బకి పెట్టుబడిదారులు తామే ఏదో పెద్ద కంపెనీ భాగస్వాములమన్న భావనలో మునిగిపోయారు. వాస్తవానికి అది మోసం కోసం వేసిన బంగారు వల.. అని గ్రహించేలోపే అంతా ముగిసిపోయింది..ఆ తరువాత అసలు స్వరూపాన్ని చూపించింది అరుణ కుమారి..

ముఖ్యంగా తన బంధువులను నియమించుకుని వారికే శఠగోపం పెట్టింది..

*** ఈవిడ గారి కుటుంబ నేపథ్యం ఒకసారి చూద్దాం :**

తాడిపత్రి అరుణ కుమారి.. విడాకులు తీసుకున్న మహిళ. ఒక కుమారుడు తరుణ్ గోపి, కూతురు సృజన (భర్త బాలాజీ). ఇక తరుణ్ గోపి స్వయంగా ఈ కంపెనీ డైరెక్టర్‌లలో ఒకరు. సుజనా టెక్ మహేంద్రలో సాఫ్ట్వేర్ ఉద్యోగి. ఇలా కుటుంబమంతా "అరుణా ప్రాజెక్ట్స్" చేసిన మాయలో తమవంతుగా భాగస్వాములయ్యారు.

ఏజెంట్లకు వలవేసింది.. తద్వారా ఏజెంట్లను వాడుకుంది.. మహేష్ రెడ్డి అనే ఏజెంట్ ద్వారా కంపెనీకి పెట్టుబడులను సేకరించింది.

వడ్డీలు చెల్లిస్తూ విశ్వాసం కలిగించింది.. ఈమె వలలో పడిన ఒక వ్యక్తికి జరిగిన అన్యాయం ఒకసారి చూస్తే.. అరుణా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మహేష్ రెడ్డి అనే వ్యక్తి ఏజెంట్ గా పనిజేస్తూ కొంతమంది అమాయకులను బుట్టలో వేసుకుని పెట్టుబడి పెట్టించడం జరిగింది.. రెండు మూడు నెలలు కంపెనీ చెప్పినట్లు పెట్టుబడి అమౌంట్ కి ఒక్కొక్కరికి ఒక్కోరకంగా 2 నుంచి 4 శాతం వడ్డీ కూడా రెండు, మూడు నెలల బాటు చెల్లింపజేశాడు.. అలాగే కంపెనీ రూల్స్ కి అనుగుణంగా అందరికీ కొంత భూమిని రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా ఒక్కొక్కరికీ వేరు వేరుగా రిజిస్ట్రేషన్ చేయడం ఎందుకు డబ్బులు దండగ అని చెబుతూ.. మొత్తం భూమిని తనపేరుమీదే రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు.. సదరు మహేష్ అనేవ్యక్తి తెలిసినవాడే కదా..? ఎక్కడికి పోతాడు అని నమ్మిన అమాయకులు అందుకు ఒప్పుకోవడం జరిగింది.. కాగా అరుణ కుమారి బిచాణా ఎత్తివేసిన తరువాత.. మహేష్ రెడ్డిని ప్రశ్నిస్తే రేపు మాపు అంటూ కాలం గడిపేస్తున్నాడు.. అరుణకుమారి ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వచ్చింది.. దీంతో ఒక బాధితుడు ఎలాగోలా కష్టపడి ఆమె నెంబర్ పట్టుకుని ఆమెకు ఫోన్ చేస్తే.. నేను మీ పెట్టుబడికి సరిపడా భూమి మహేష్ పేరుమీద రిజిస్ట్రేషన్ చేశాను.. అతని దగ్గర మీరు వసూలు చేసుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి ఫోన్ కట్ చేసింది.. ఇదే విషయం మహేష్ ని ప్రశ్నిస్తే .. ఆ భూమిని మీ అందరి పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తే నాగతి ఏమి కాను..? అని సమాధానం చెబుతున్నాడని బాధితులు వాపోయారు.. కాగా ఆ భూమి మహేష్ పేరుమీద రిజిస్ట్రేషన్ చేయడానికి బాధితులు రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించారు.. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటి అని వారు కన్నీరు మున్నీరు అవుతున్నారు..

**ఆర్గానిక్ ఫార్మింగ్ పేరుతో దగా :**

"20 నెలల్లో లాభాలు", "ఫార్మ్ రిసార్ట్స్", "పౌల్ట్రీ", "డైరీ", "మష్రూమ్", "మిల్లెట్స్ ఫార్మింగ్" అంటూ అరచేతిలో స్వర్గం చూపించింది.

నిజానికి ఒక్క గుంట భూమి కూడా లేదు కేవలం ఆమె కల్లబొల్లి మాటలనే అమ్మింది అని చెప్పవచ్చు.. "అశ్వద్ధ ఆర్గానిక్ గార్డెన్స్", "అరుణా ప్రాజెక్ట్స్" పేర్లతో 3 సంవత్సరాలుగా మోసపూరిత వ్యాపారం నడిపింది.

అందుకే ఎప్పుడూ అధిక లాభాలకు, వడ్డీలకు, ఈజీ మనీకి ఆశపడకూడదని పెద్దలు చెబుతుంటారు.. కానీ అవన్నీ పెడచెవిన పెట్టి మోసపోతూ ఉంటారు.. అయితే ప్రభుత్వాలు ఇలాంటి వారిని కట్టడి చేయకపోవడం దురదృష్టం.. అరుణా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లిస్టెడ్ బై షేర్స్ స్థానంలో ఉంది.. 3 సంవత్సరాలుగా అప్రతిహతంగా మోసపూరిత వ్యాపారం చేస్తూనే వున్నారు.. కాగా ఈ కంపెనీ చివరి అనువల్ జనరల్ మీటింగ్ 2023 సెప్టెంబర్ 30న జరిగింది.. చివరి బాలన్స్ షీట్ ని 2023 మర్చి 31 న తీసుకువచ్చారు.. అరుణా ప్రాజెక్ట్స్, అశ్వద్ధ ఆర్గానిక్ గార్డెన్స్ అంటూ ఆకర్షణీయమైన పేర్లతో పేర్లతో అమాయకులను నిట్ట నిలువునా ముంచేసింది..



2024లో అక్రమ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి జలసాలు చేస్తున్న అరుణ తాటిపర్తి

*** కిలేడీ అరుణ కుమారి నిజస్వరూపం :**

అందంగా ఉంటుంది--- అంతకంటే అందంగా మాట్లాడుతుంది. స్వర్గం చూపించినట్లే చూపిస్తుంది--- చివరికి నరకంలోకి నెట్టేస్తుంది..



రైతు వేషంలో అరుణకుమారి తాడిపర్తి. అరుణ ప్రాజెక్ట్స్ అధినేత్రి

ఇప్పటికే కోట్ల రూపాయలు కొల్లగొట్టి బిచాణా ఎత్తేసింది. ఇక బాధితుల రోదన అరణ్యరోదనే అయ్యింది.. కొందరు తమ పుస్తెలు, ఆభరణాలు అమ్మి పెట్టుబడులు పెట్టి జీవితాంతం శాపగ్రస్తులుగా మిగిలిపోయారు.. అంతులేని అగాధంలో కూరుకుపోయారు..

*** ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి :**

ప్రభుత్వం పూనుకుని అరుణకుమారి అనే కిలేడీని అదుపులోకి తీసుకుని ఆమె చేతిలో మోసపోయిన వారి డబ్బులు తిరిగి ఇప్పించాలని, అలాగే సినిమా ప్రపంచం అనే ఒక మాయా ప్రపంచాన్ని ఎరగా వేసిన తరుణ్ గోపి అనే మోసగాడిని, మహేష్ రెడ్డి లాంటి ఏజెంట్లను అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించి అమాయకులకు న్యాయం చేయాలని బాధితులు కోరుకుంటున్నారు.. మరోసారి ఇలాంటి మోసగాళ్లు బరితెగించకుండా.. అమాయకులు మాయలో పది మోసపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అడ్డదిడ్డంగా అమాయకుల నుంచి అరుణకుమారి అక్రమంగా సంపాదించిన ఆస్తులను జప్తుచేసి, ఆమె బ్యాంకు అకౌంట్లను సీజ్ చేసి, వాటిని స్వాధీనం చేసుకుని బాధితులకు తిరిగి పంచాలని కోరుకుంటున్నారు.. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం మేల్కొంటుందా? ఇలాంటి కిలేడీలకు చెక్ పెడుతుందా..? అమాయకుల కన్నీళ్లు తుడుస్తుందా..? లేదా--- మరో కొత్త




# రూ.21.21 లక్షలను విడుదల చేసిన జిల్లా గ్రీవెన్స్ కమిటీ

హైదరాబాద్, అక్టోబర్ 15 (భారత శక్తి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల సందర్భంగా అమలులో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి కింద స్వాధీనం చేసుకున్న రూ.21.21 లక్షలను బుధవారం విడుదల చేసింది. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ కె.మంగతాయారు అధ్యక్షతన గల కమిటీ జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో విచారణలు నిర్వహించింది. మొత్తం 5 కేసులకు సంబంధించి సాక్ష్యాధారాలు పరిశీలించింది. ఎన్నికలకు సంబంధం లేని నగదు అని రూఢి చేసుకున్న తర్వాత స్వాధీనం చేసుకున్న రూ.21,21,600/ నగదును విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ పి. వెంకటేశ్వర్ రెడ్డి, సభ్యులు వసుంధర, వి శరత్ చంద్రలు పాల్గొన్నారు.

# 2040లో భారతీయ వ్యోమగామి చంద్రుడిపై అడుగు పెడతారు

ఢిల్లీ, అక్టోబర్ 15 (భారత శక్తి) : వికసిత భారత్‌కు సూచికగా 2040లో భారతీయ వ్యోమగామి చంద్రుడిపై అడుగు పెట్టనున్నారని ఇస్రో ఛీఫ్ నారాయణన్ పేర్కొన్నారు. అంతరిక్ష రంగ అభివృద్ధికి ప్రస్తుతం అనేక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. వాటిలో 80 వేల కేజీలను మోసుకెళ్లే రాకెట్ల తయారీ, 2026లో వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపడం, 2035 నాటికి జాతీయ అంతరిక్ష కేంద్రం, చంద్రుడిపై అధ్యయనానికి వీనస్ ఆర్బిటర్ మిషన్ ఏర్పాటు వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు తెలిపారు. 2027లో చేపట్టబోయే మానవసహిత గగనయాత్ర మిషన్ ప్రణాళికాబద్ధంగా సాగుతోందని వెల్లడించారు. 2040 నాటికి తొలి మానవసహిత చంద్రయాత్ర చేపట్టాలని ప్రధాన మంత్రి నిర్దేశించారని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఈ అంతరిక్ష యాత్ర కీలకమని ఆయన అన్నారు. కొన్నేళ్ల క్రితం అంతరిక్ష రంగంలో రెండు లేదా మూడు స్టార్టప్‌లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం ఉపగ్రహ తయారీ, ప్రయోగ సేవలు, అంతరిక్ష ఆధారిత డేటా విశ్లేషణపై అధ్యయనం కోసం 300 కంటే ఎక్కువ స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని ఇస్రో చీఫ్ వెల్లడించారు. వ్యవసాయం మొదలు వాహన పర్యవేక్షణ వరకు ఉపగ్రహ ఆధారిత అనువర్తనాల అధ్యయనానికి ఈ ప్రయోగాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు.

## గూగుల్‌తో పాటు అదీ ముఖ్యమే

అమరావతి, అక్టోబర్ 15 (భారత శక్తి) : ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా ఉండాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, దేశంలోనే మంగళగిరిని అభివృద్ధి పథాన నిలుపుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంగళగిరి బైపాస్ ఆత్మకూరులో లక్ష్మీ గ్రూప్ ఆధ్వర్యంలో శ్రీ ధనలక్ష్మి ఆటో ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ నూతనంగా ఏర్పాటుచేసిన టాటా హిటాచీ డీలర్ షిప్ షోరూం, మెషిన్ కేర్ ఫెసిలిటీని రిబ్బన్ కట్ చేసి మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. "ఇక్కడకు వస్తుంటే రోడ్డుపైన ఒక ఎక్స్‌కవేటర్ పెట్టారు. అది చూసినప్పుడు నాకు 201924 మధ్య రోజులు గుర్తుకు వచ్చాయి. గత ప్రభుత్వంలో శుక్ర, శనివారాలు వస్తే ఈ బుల్డోజర్‌ను ఎవరో ఒకరి ఇంటికి పంపేవారు. ఎవరో ఒకరిని ఇబ్బంది పెట్టాలని గత ప్రభుత్వం ప్రయత్నించింది. ప్రజా ప్రభుత్వంలో మాత్రం ఎక్స్‌కవేటర్స్‌ను అభివృద్ధి కోసం, అమరావతి పనులు, రోడ్లు అభివృద్ధి చేసేందుకు ఉపయోగిస్తోంది. మంగళగిరి అమరావతికి ముఖద్వారం. అమరావతిలో పనులు చేసేవారు మంగళగిరిలోనే ఉండాలి. సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎకోసిస్టమ్ మంగళగిరిలోనే ఇప్పుడు సిద్ధంగా ఉంది. 2019 ఎన్నికల్లో 21 రోజుల ముందు మంగళగిరికి వచ్చాను. మీ సమస్యలను నేను అర్థం చేసుకోలేకపోయాను. నేనెంటో మీకు తెలియదు. 5300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఐదేళ్లపాటు మీకు అందుబాటులో ఉండి మీ సమస్యలు తెలుసుకున్నాను. ప్రభుత్వం కంటే మెరుగైన సేవా కార్యక్రమాలను ఆనాడు నేను చేశాను" అని లోకేశ్ అన్నారు.

*** మంగళగిరిలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు**

2024 ఎన్నికల్లో మంగళగిరిలో పోటీ చేయవద్దని తనను చాలామంది కోరారని, అయినా ఇక్కడి నుంచే పోటీచేసి గెలుస్తానని చెప్పానని లోకేశ్ గుర్తు చేసుకున్నారు. 53 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఆనాడు కోరానని, తనను ఏకంగా 91 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపించారని అన్నారు. ఈ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సహచర మంత్రులు.. ఇలా ఎవరైనా మంగళగిరి కోసం పని అంటే కాదని చెప్పేవారు లేరని అన్నారు. ఇంటి పట్టాలు, వంద పడకల ఆసుపత్రి, స్మశానాల అభివృద్ధి, కమ్యూనిటీ భవనాలు, భూగర్భ డ్రైనేజీ, తాగునీరు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. మంగళగిరిలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. బుల్డోజర్‌ను మంచి కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని అన్నారు. జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్‌ను మంగళగిరిలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంత పని ఒత్తిడి ఉన్నా ముందు మంగళగిరికే ప్రాధాన్యత ఇస్తానని, గూగుల్ ఎంత ముఖ్యమో ఈ డీలర్ షిప్ కూడా తనకు అంతే ముఖ్యమని అన్నారు.

*** గూగుల్‌తో పాటు డీలర్‌షిప్‌లు కూడా ముఖ్యమే**

"డీలర్‌షిప్ వల్ల ఎంతోమందికి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ప్రతి ఉద్యోగం ఎంతో ముఖ్యం. గూగుల్ లాంటి సంస్థ వస్తే సరిపోదు. వారు భవన నిర్మాణాలు చేయాలంటే ఎకో సిస్టమ్ కావాలి. ఇదే ఎక్స్‌కవేటర్, బుల్డోజర్ కూడా అవసరం. దానికి సర్వీస్ సెంటర్ కావాలి. చంద్రబాబుని చూసే నేను ఇది నేర్చుకున్నాను. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. డీలర్‌షిప్‌ల వల్ల కూడా ఉద్యోగాల కల్పన జరుగుతుంది. మొత్తం ఎకోసిస్టమ్ వస్తే మేం ఇవన్నీ సాధించగలగుతాం. ఇతర డీలర్‌షిప్‌లను కూడా మంగళగిరి ఏర్పాటు చేస్తే మా యువతకు ఉద్యోగాలు వస్తాయని కంభంపాటి గారిని కోరుతున్నాను. లక్ష్మీ గ్రూప్‌ను చూస్తూ పెరిగాను. ఎంతో నిబద్ధత గల సంస్థ. టీడీపీ ఎంతోమంది ఎదుగుదలకు తోడ్పడింది. కంభంపాటి గారు దాదాపు 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించారు. సంస్థ మరింత వృద్ధిలోకి రావాలని కోరుకుంటున్నాను" అని లోకేశ్ అన్నారు.

## పండగ ఆఫర్లతో సైబర్ వల..
## ఆన్‌లైన్ షాపింగ్‌లో జాగ్రత్త అంటూ పోలీసుల హెచ్చరిక!

హైదరాబాద్, అక్టోబర్ 15 (భారత శక్తి) : పండగ సీజన్ సమీపిస్తుండటంతో ఆన్‌లైన్ షాపింగ్ చేసే వారు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరించారు. దీపావళి సందర్భంగా సైబర్ నేరగాళ్లు భారీ డిస్కౌంట్లు, బహుమతుల పేరుతో వినియోగదారులను ఆకర్షించి, ఆర్థికంగా మోసగిస్తున్నారని ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ ఈకామర్స్ సైట్లు, ప్రమాదకరమైన ఏపీకే (APK) ఫైల్స్, ఫిషింగ్ లింకులు, సోషల్ మీడియా ప్రకటనల ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సూచించారు.

**మోసగాళ్లు అనుసరిస్తున్న విధానం**

సైబర్ నేరగాళ్లు పండగ వాతావరణాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, బహుమతులపై నమ్మశక్యం కాని ఆఫర్లతో కూడిన లింకులను సర్క్యులేట్ చేస్తున్నారు. ఈ లింక్‌లపై క్లిక్ చేయడం లేదా వారు పంపిన ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా బాధితుల ఫోన్లలోకి మాల్‌వేర్ ప్రవేశిస్తుంది. దీని సాయంతో వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, క్రెడిట్ /డెబిట్ కార్డు నంబర్లు, ఓటీపీలను దొంగిలించి ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. కొందరు "దీపావళి గిఫ్ట్" వచ్చిందని నమ్మించి, ప్రాసెసింగ్ ఫీజు పేరుతో చిన్న మొత్తంలో డబ్బులు కట్టించుకుని, ఆ తర్వాత పెద్ద మొత్తంలో దోచేస్తున్నారు.

**నగరంలో వెలుగుచూసిన మోసాలు**

కేస్ స్టడీ 1: సికింద్రాబాద్‌కు చెందిన 29 ఏళ్ల మహిళకు ఓ ప్రముఖ షాపింగ్ సైట్ ప్రతినిధులుగా నమ్మించి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ఆమె గతంలో చేసిన కొనుగోలు వివరాలు చెప్పి, ప్రత్యేక గిఫ్ట్ ఆఫర్‌కు ఎంపికయ్యారని తెలిపారు. రూ.5,000 విలువైన వస్తువు కొనుగోలు చేసి, ఆ మొత్తాన్ని నేరుగా ఓ బ్యాంక్ ఖాతాకు పంపాలని సూచించారు. ఆ తర్వాత గిఫ్ట్‌గా రానున్న ఐఫోన్ 13 కోసం జీఎస్టీ కింద రూ.9,840 చెల్లించాలని కోరారు. వారి మాటలు నమ్మిన ఆమె, పలు దఫాలుగా మొత్తం రూ.1,40,000 బదిలీ చేసి మోసపోయారు.

కేస్ స్టడీ 2: అజంపురాకు చెందిన 69 ఏళ్ల వృద్ధుడు ఓ ఆన్‌లైన్ యాప్ కస్టమర్ కేర్ కోసం గూగుల్‌లో వెతకగా, నకిలీ నంబర్ లభించింది. దానికి కాల్ చేయగా, అవతలి వ్యక్తి వాట్సాప్‌లో ఒక ఏపీకే ఫైల్ పంపి ఇన్‌స్టాల్ చేసుకోమని చెప్పాడు. అలా చేసిన వెంటనే, మోసగాళ్లు అతని కుటుంబ సభ్యుల ఫోన్లపై రిమోట్ యాక్సెస్ సంపాదించి, వారి బ్యాంకు ఖాతాల నుంచి రూ.1,02,194 విత్‌డ్రా చేశారు.

**ప్రజలకు పోలీసుల సూచనలు**

* గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింక్‌లను క్లిక్ చేయవద్దు, అనధికారిక ఏపీకే ఫైల్స్‌ను ఇన్‌స్టాల్ చేయవద్దు.
* కేవలం విశ్వసనీయ, గుర్తింపు పొందిన ఈకామర్స్ వెబ్‌సైట్ల నుంచే కొనుగోళ్లు చేయాలి.
* అపరిచిత లింకులు, పోర్టళ్లలో మీ బ్యాంకింగ్, కార్డు వివరాలను ఎట్టిపరిస్థితుల్లోనూ నమోదు చేయవద్దు.
* బహుమతులు, రివార్డులు, లక్కీ డ్రాల పేరుతో వచ్చే కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దు.
* అన్ని ఆన్‌లైన్ బ్యాంకింగ్, షాపింగ్ ఖాతాలకు టూఫ్యాక్టర్ అథెంటికేషన్ (2FA) ఎనేబుల్ చేసుకోండి.

ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. తక్షణమే స్పందిస్తే మోసపూరిత లావాదేవీలను నిలిపివేసి, నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సూచించారు.

## ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దాం: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 15 (భారత శక్తి) : ప్రధాని నరేంద్ర మోదీ గురువారం చేపట్టనున్న శ్రీశైలం, కర్నూలు పర్యటనలను అత్యంత విజయవంతం చేయాలని సీఎం చంద్రబాబు కూటమి నేతలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన మంత్రులు, నంద్యాల, కర్నూలు జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ విధానాలతో రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతోందని, దానికి నిదర్శనమే ఇటీవలి గూగుల్ ఒప్పందమని ఆయన అన్నారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వనీ వైష్ణవ్ ప్రత్యేక చొరవతోనే గూగుల్ సంస్థ రాష్ట్రానికి ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందని చంద్రబాబు తెలిపారు. ఢిల్లీలో కుదిరిన ఈ చారిత్రాత్మక ఒప్పందం వెనుక ఐటీ మంత్రి నారా లోకేశ్ కృషి ఎంతో ఉందని ప్రశంసించారు. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్టు, దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అని ఆయన గుర్తుచేశారు. గత ప్రభుత్వ విధ్వంసకర విధానాల వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, వాటిని సరిదిద్దడానికే చాలా సమయం పట్టిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కేంద్ర సహకారంతో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు. రాయలసీమను పారిశ్రామిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. రేపటి పర్యటనలో ప్రధాని మోదీ రూ.13 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని సీఎం వివరించారు. కర్నూలులో జరిగే 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున హాజరవుతారని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కూటమిలోని మూడు పార్టీల నేతలు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు.


## నామినేషన్ వేసిన మాగంటి సునీత..
### వెంట కేటీఆర్, ముఖ్యనేతలు

హైదరాబాద్, అక్టోబర్ 15 (భారత శక్తి) : జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గానికి జరగనున్న ఉపఎన్నికల ప్రక్రియ వేడెక్కింది. బీఆర్ఎస్ పార్టీ తరఫున అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అర్ధాంగి మాగంటి సునీత తన నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర ముఖ్య నేతలతో కలిసి ఈరోజు ఆమె షేక్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి తొలి సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఈ ఉపఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ అత్యంత పట్టుదలగా ఉంది. ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. అక్టోబర్ 22న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అక్టోబర్ 24వ తేదీ వరకు గడువు విధించారు. నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

## కేసీఆర్ ఫొటో లేకుండానే... 33 జిల్లాల యాత్రకు కవిత

హైదరాబాద్, అక్టోబర్ 15 (భారత శక్తి) : తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటో లేకుండానే రాష్ట్రవ్యాప్త యాత్రకు సిద్ధం కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 'సామాజిక తెలంగాణ' లక్ష్యంగా, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఫొటోతో ప్రజల్లోకి వెళ్లాలని ఆమె నిర్ణయించుకోవడం కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తుందన్న అంచనాలు వెలువడుతున్నాయి. దీపావళి పండుగ తర్వాత ఈ యాత్రను ప్రారంభించి, వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లో పర్యటించాలని కవిత ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన రూట్ మ్యాప్ కూడా ఖరారైందని తెలుస్తోంది. తన యాత్ర వివరాలతో కూడిన పోస్టర్‌ను ఆమె ఈ రోజు మధ్యాహ్నం 2 గంటలకు విడుదల చేయనున్నారు. ఈ యాత్రలో భాగంగా కవిత రాష్ట్రంలోని మేధావులు, విద్యావంతులు, వివిధ వర్గాల ప్రజలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. రాజకీయంగా భవిష్యత్తులో ఎలా ముందడుగు వేయాలనే అంశంపై వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బీఆర్ఎస్ పార్టీలోని కొందరు నేతలపై ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన నేపథ్యంలో, ఇప్పుడు చేపట్టబోయే ఈ యాత్రకు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజల నుంచి వచ్చే స్పందన, మద్దతును అంచనా వేసిన తర్వాత కవిత తన సొంత పార్టీని ప్రకటించే యోచనలో ఉన్నారని రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పుడు కేసీఆర్ ఫొటోను పక్కనపెట్టి యాత్ర చేయాలన్న నిర్ణయం ఈ వాదనలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. మొత్తంగా, కవిత యాత్ర తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు దారితీస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## రౌడీషీటర్ నవీన్ రెడ్డి నగర బహిష్కరణ



ఆదిభట్ల, అక్టోబర్ 15 (భారత శక్తి): రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు ఐపీఎస్, ఆదిభట్ల సర్కిల్ ఇన్స్ పెక్టర్ సమర్పించిన రికార్డులను పరిశీలించిన తర్వాత, తేదీ.30.09.2025 న హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్, 1348 ఫస్లీ, సెక్షన్ 26(1) నిబంధనల ప్రకారం రౌడీ షీటర్ అయిన కొడుదుల నవీన్ రెడ్డి తండ్రి కోటి రెడ్డి, వయస్సు: 32 సంవత్సరాలు, కులం: (రెడ్డి), వ్యాపారం, ప్లాట్ నెం. 34, తిరుమల హోమ్స్, స్లోకా స్కూల్ దగ్గర, మన్నెగూడ, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా.ఇంటి నెంబర్ 124/సీ, ముషంపల్లి గ్రామం, నల్గొండ జిల్లాకు చెందిన వ్యక్తికి నగర బహిష్కరణ ఉత్తర్వులు నోటీసును జారీ చేశారు. స్థానికంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చట్టవిరుద్ధ కార్యకలాపాలలో పాల్గొంటున్నందుకు, ఏసీపీ ఇబ్రహీంపట్నం ద్వారా నోటీసు అందిన ఏడు రోజులలోగా, తనను రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధి నుండి 6 నెలల పాటు ఎందుకు బహిష్కరించకూడదో కారణం తెలపాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. పైన పేర్కొన్న కొడుదుల నవీన్ రెడ్డి (రౌడీ షీటర్) పై ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో దాడి, హత్యాయత్నం, క్రిమినల్ బెదిరింపులు, అల్లర్ల వంటి నేరాలతో సహా పలు క్రిమినల్ కేసుల నేర చరిత్ర ఉంది. అతను ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, భయాందోళనలు సృష్టించడంలో పేరుగాంచాడు. అతని నిరంతర బెదిరింపుల కారణంగా, ప్రజలు అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి లేదా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారు. కావున ఇతనిపై నగర బహిష్కరణ విధించటం జరిగింది.


## కబ్జాల చెర నుంచి రూ.139 కోట్ల విలువైన భూమికి విముక్తి

*** 19,878 గజాల పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా..**

*** రాజేంద్రనగర్ లో ఆక్రమణల తొలగింపు...**




హైదరాబాద్, అక్టోబర్ 15 (భారత శక్తి): రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలంలో కబ్జాలను హైడ్రా బుధవారం తొలగించింది. బద్వేల్ ఉప్పరపల్లి గ్రామాల్లో జనచైతన్య లేఔట్ ఫేజ్ 1, 2, లలో ఆక్రమణలకు గురైన 4 పార్కులకు హైడ్రా విముక్తి కల్పించింది. 19,878 గజాల భూమిని ఆక్రమణదారుల నుండి స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ.139 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. దాదాపు 120 ఎకరాల్లో ఫేజ్ ఒన్ , టు పేరుతో హుడా అప్రూవల్ తో ఏర్పాటు చేసిన జనచైతన్య లేఔట్ లో ప్రజా పార్కులు కబ్జాకు గురి అవుతున్నాయని హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ,మున్సిపల్ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కబ్జాలు జరిగినట్టు హైడ్రా నిర్ధారించింది. ఈ మేరకు బుధవారం కబ్జాలను తొలగించింది. ప్రహరీలు నిర్మించుకొని వేసిన షెడ్డులను, రేకుల గదులను హైడ్రా నేలమట్టం చేసి తొలగించింది. 3 వేలు, వెయ్యి గజాలు, అయిదు వందల గజాల చొప్పున ఆక్రమించి నిర్మించిన షెడ్డులను నేలమట్టం చేసింది. ఆక్రమణల తొలగింపు తర్వాత వెను వెంటనే ఫెన్సింగ్ నిర్మాణ పనులు చేపట్టింది.



# పబ్లిక్ టాయిలెట్స్ ని కూడా వదలని
# జిహెచ్ఎంసి అవినీతి కంపు..

( స్పెషల్ కరస్పాండెంట్ )

**హైదరాబాద్, అక్టోబర్ 15 (భారత శక్తి) :** ప్రజల ఆరోగ్యం, శుభ్రతకు ప్రతీకగా ఉండాల్సిన "ప్రజా మరుగుదొడ్లు".. ఇప్పుడు జీహెచ్ఎంసీ పరిధిలో అవినీతి, నిర్లక్ష్యం, దుర్వినియోగానికి ప్రతీకలుగా మారిపోయాయి. కోట్ల రూపాయల నిధులు కేటాయించినా, నగర వీధుల్లో ఆ సౌకర్యాల ఉనికి కాగితాలపైనే మిగిలిపోవడం అత్యంత ఘోరమైన విషయం.

**నిధులు ఉన్నాయి... కానీ నీతి లేదు :**

స్వచ్ఛ భారత్ మిషన్ పేరుతో ప్రభుత్వం, జీహెచ్ఎంసి కలిసి పెద్ద ఎత్తున బడ్జెట్‌లు కేటాయించాయి. ప్రతి డివిజన్‌లో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు.కానీ వాస్తవ పరిస్థితి ఏమిటి? కాంట్రాక్టర్లతో కుమ్మక్కై తక్కువ నాణ్యత గల నిర్మాణాలు, వాడకానికి వీలు కాని సదుపాయాలు, మరికొన్ని చోట్ల "కాగితాల మీదే పూర్తయిన" ప్రాజెక్టులు. ప్రజల పన్ను డబ్బు ఇలా వృథా కావడం మన పరిపాలనా వ్యవస్థలో ఉన్న లోపాలకు నిదర్శనం.

* **సదుపాయం పేరుతో ప్రజలకు తీరని నష్టం :**

హైదరాబాద్ నగరంలోని మార్కెట్లు, బస్ స్టాండ్లు, ఫుట్‌పాత్ ప్రాంతాలు, పార్కులు.. వీటిలో చాలా చోట్ల టాయిలెట్స్ ఉన్నా అవి మూతపడిపోయాయి లేదా చెత్తా చెదారాలతో నిండిపోయాయి. నీటి సదుపాయం లేక, లైటింగ్ లేక, భద్రతా సిబ్బంది





లేక ప్రజలు వాటిని ఉపయోగించలేకపోతున్నారు. మహిళలకు ప్రత్యేక టాయిలెట్లు ఉన్నా తాళం వేసి మూసివేయడం సర్వసాధారణం. ఇది మహిళల భద్రత, గౌరవం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం..

* **ప్రైవేట్ నిర్వహణలో రాజ్యమేలుతున్న దోపిడి :**

జీహెచ్ఎంసీ పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించింది. కానీ ఈ ఏజెన్సీలు లాభాలకే ప్రాధాన్యం ఇచ్చి, ప్రజా ప్రయోజనాలను విస్మరిస్తున్నాయి. ఫీజులు పెంచడం, సిబ్బందికి జీతాలు ఆలస్యంగా ఇవ్వడం, పరిశుభ్రతను నిర్లక్ష్యం చేయడం.. ఇవన్నీ నిత్యకృత్యాలుగా మారిపోయాయి. అధికారుల పరిశీలన ఉండదు, పర్యవేక్షణా ఉండదు. దీంతో గొప్పగా చెప్పుకునే "ప్రజా సదుపాయం" అనేది కేవలం వినడానికి మాత్రమే మిగిలిపోయింది..

* **ఓపెన్ డేఫికేషన్ నగరం కేవలం ఒక నినాదమే :**

"ఓపెన్ డెఫెకేషన్ ఫ్రీ సిటీ" గా హైదరాబాద్ ను ప్రకటించింది జీహెచ్ఎంసి కానీ వాస్తవ పరిస్థితి చూసే సరికి అది కేవలం ప్రచార నినాదంగా మారిపోయింది. నగర శివార్లలో ఇప్పటికీ ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో అవసరాలు తీర్చుకోవడం సిగ్గుచేటు. ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం..

ప్రతి టాయిలెట్‌కు జియో ట్యాగింగ్, క్యూఆర్. కోడ్ మానిటరింగ్ తప్పనిసరి చేయాలి. మహిళా స్వయం సహాయక సమితులు అంటే ఎస్.హెచ్.జీ.లు నిర్వహణ బాధ్యతలు చేపట్టేలా చూడాలి. కాంట్రాక్టుల కేటాయింపులో పారదర్శక టెండర్ విధానం అమలు చేయాలి.


ప్రతి నెలా ప్రజా సమీక్ష రిపోర్ట్ జీహెచ్ఎంసి వెబ్‌సైట్‌లో ఉంచాలి. కానీ ఇవన్నీ జరుగుతాయా అంటే జవాబు లేదు..పబ్లిక్ టాయిలెట్స్ ఒక నగర నాగరికతకు ప్రతిబింబం. అవి పాడైపోతే, మురికిలో మునిగిపోతే, అది ప్రజల నిర్లక్ష్యం కాదు.. పరిపాలనా వైఫల్యమని ప్రభుత్వ అధికారులు గమనించాలి..హైదరాబాద్ వంటి మహానగరానికి శుభ్రత, సదుపాయం, పారదర్శకత అవసరం.. నినాదాలు కాదు, నిజమైన చర్యలు కావాలి.


బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్వచ్ఛ సర్వేక్షన్ స్వచ్ఛభారత్ సెంట్రల్ కమిటీ పర్యవేక్షణ జరిగే తరుణంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీ రామారావు హైదరాబాద్ మహానగరానికి మంచి రేటింగ్ తీసుకురావడం కోసం ఆగ మేఘాల మీద టెండర్లు పిలిచి గోల్మాల్ చేసి టాయిలెట్లు ఏర్పాటు చేశారు..ఈ టాయిలెట్లు ఏర్పాటు చేయడంలో టెండర్లలో భారీ ఎత్తున ముడుపులు తీసుకొని నాసిరకం టాయిలెట్లు ఏర్పాటు చేశారని ఆరోపణలు వున్నాయి..వీరు ఏర్పాటు చేసిన టాయిలెట్లు రెండు రోజులు కూడా పని చేసిన దాఖలాలు లేవు..వీటి నిర్వహణ కోసం ఈ ప్రభుత్వంలో కూడా దొంగ బిల్లులు పెట్టి అధికారులు తీసుకొని దర్జాగా ఎంజాయ్ చేస్తున్నారు..

జీహెచ్ఎంసి పబ్లిక్ టాయిలెట్లు వేలాది ఫ్రీ ఫ్యాబ్రికేటెడ్, బయో, ఆర్‌సీసీ టాయిలెట్లు ఏర్పాటు చేసింది. వీటిని రోజూ శుభ్రం చేయడానికి గుత్తేదారులను నియమించారు. అయినప్పటికీ, నిధుల దుర్వినియోగం, నిర్వహణలో లోపాలు ఉన్నందున, టాయిలెట్ల సగం భాగం నిరుపయోగంగా మారింది. దీనివల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యాలు ఏర్పడ్డాయి.. అలాగే పబ్లిక్ టాయిలెట్ల అక్రమ బిల్లులు తదితర దుర్వినియోగాల గురించి కమిషనర్ ఆర్వీ కర్ణన్ గుర్తించారు. అలాగే, గుత్తేదారులు పంచుకున్న ప్రభుత్వం సొమ్మును అక్రమంగా ఉపయోగించారని కూడా తెలుస్తోంది..

జీహెచ్ఎంసి ప్రత్యేకంగా మహిళల భద్రత, పరిశుభ్రత అవసరాలను పరిగణలోకి తీసుకుని "షీ టాయిలెట్ల"ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం సహా పౌరుల కోసం కొత్త పథకాలు తీసుకున్నారు..ఈ అంశాలలో జీహెచ్ఎంసి పర్యవేక్షణ లోపాలు, అక్రమ పంపిణీలు, నిధుల దుర్వినియోగం కారణంగా పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, అధికార వినియోగంలో అనేక సమస్యలు, అవకతవకలు వెలుగుచూశాయి..

బి.ఓ.టి టాయిలెట్స్ (బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్ఫర్).. ఫ్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్స్.. సులాబ్ కాంప్లెక్స్ (సులభ్ టాయిలెట్స్)..ఇంజనీరింగ్ టాయిలెట్స్ ఇలా పలురకాల టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప వాస్తవ రూపంలో అధ్వాన్నంగా ఉన్నాయన్నది సుస్పష్టం.. ఈ దుర్భర పరిస్థితుల్లో మార్పు రాకపోతే న్యాయ పోరాటం చేయాలని కృతనిశ్చయంతో ఉందని " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " హెచ్చరిస్తోంది...





- పేరుకే ప్రజా మరుగుదొడ్లు.. సౌకర్యాలు నిల్.. అక్రమార్జన ఫుల్..
- టాయిలెట్స్ పేరుతో నిధుల దుర్వినియోగం..
- కాగితాల వరకే పరిమితం అయిన పరిశుభ్రత..
- కేటాయించిన భారీ నిధులను కైంకర్యం చేసిన దుర్మార్గులు..
- గత ప్రభుత్వంలో మంత్రిగా చేసిన ఒక పెద్దమనిషి చేసిన మాయాజాలం..
- కోట్లు కొల్లగొట్టి, గ్రేటర్ హైదరాబాద్ ప్రజలకు శఠగోపం పెట్టిన దౌర్భాగ్యం..
- టాయిలెట్స్ నిర్మించకపోయినా బిల్లులు దొబ్బేసిన వైనం..
- ప్రైవేట్ నిర్మాణదారులతో చేతులు కలిపి అంతులేని అవినీతి..
- ఇంత నీచానికి దిగజారిన వారిని క్షమించాలా అంటున్న విశ్లేషకులు..
- పబ్లిక్ టాయిలెట్స్ మాయాజాలంపై " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ అందిస్తున్న సంచలనాత్మక కథనం "..



---




టి ఎస్ టి సి ఏ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్. అయినేని

## టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులకు
## సర్టిఫికెట్లు ఇవ్వక ఇబ్బందులు


* **ఉన్నత విద్యాశాఖ నోటీసులు జారీ చేసినా స్పందించని యాజమాన్యం –**
* **కాలేజ్ పై చర్యలు తీసుకోవాలి; అయినేని సంతోష్ కుమార్**

హైదరాబాద్, అక్టోబర్ 15 (భారత శక్తి): రాష్ట్ర రాజధానిలోని ప్రముఖ విద్యాసంస్థలలో ఒకటైన (తీగల కృష్ణారెడ్డి) టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ మరోసారి వివాదంలో చిక్కుకుంది. బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం జాప్యం చేస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసీఈ విభాగంలో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థి మూడవత్ సంతోష్, తన సర్టిఫికెట్లు ఇవ్వాలని కళాశాల యాజమాన్యాన్ని అడిగినప్పటికీ, "ప్రభుత్వ ఫీజు రీయింబర్స్మెంట్ ఇంకా విడుదల కాలేదు. కాబట్టి ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోండి" అని వారు చెప్పారని విద్యార్థి ఆరోపించాడు.దీంతో సంతోష్ తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (టీజీసిఎచ్ఈ)కి ఫిర్యాదు చేశాడు. విద్యార్థి ఫిర్యాదును సీరియస్‌గా పరిగణలోకి తీసుకున్న ఉన్నత విద్యాశాఖ అధికారులు, టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి విద్యార్థికి తక్షణం సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించారు. అయితే నోటీసులు జారీ అయినప్పటికీ కళాశాల యాజమాన్యం ఇప్పటివరకు స్పందించకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది.ఈ సందర్భంగా టీఎస్టీసీఈఏ అధ్యక్షుడు అయినేని సంతోష్ కుమార్ మాట్లాడుతూ, "రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ విడతల వారీగా విడుదల చేస్తోంది. అయినప్పటికీ విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం చట్టవిరుద్ధం. ఉన్నత విద్యా శాఖ ఆదేశాలను కూడా పట్టించుకోకపోవడం బాధాకరం. వారికి బంగారు భవిష్యత్తు లేకుండా చేస్తున్న టీకేఆర్ కాలేజ్ యాజమాన్యంపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం,"అని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు పణంగా పెట్టి ఇలా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం అనేది నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. తక్షణమే కాలేజీపై చర్యలు తీసుకోకపోతే విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాయని హెచ్చరించారు.

---

## ఇలా అయితే చదువు అబ్బేదెలా..?

### 7 తరగతులకు ఇద్దరే ఉపాధ్యాయులు..



* యాదాద్రి భువనగిరి జిల్లాలో వింత పరిస్థితి
* పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రుల ఆవేదన
* ప్రమోషన్లపై వెళ్ళిపోయిన 5 గురు ఉపాధ్యాయులు
* అధికారులను అడిగితే చేతులెత్తేసిన దౌర్భాగ్యం
* 76 మంది విద్యార్థులకు ఇద్దరితో బోధన ఎలా సాధ్యం అవుతుంది..?
* 1 నుంచి 7 వ తరగతి వరకు మెయింటైన్ చేయడం ఎంతో కష్టం
* జిల్లా విద్యాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలి..
* తీవ్ర మానసిక క్షోభకు గురౌతున్న ఇద్దరు టీచర్లు

హైదరాబాద్, అక్టోబర్ 15 (భారత శక్తి): నేటి బాలలే రేపటి పౌరులు అంటారు..అదెలా సాధ్యం అవుతుంది..? చిన్నప్పటి నుంచి సరైన విద్య, క్రమశిక్షణ వారికి అలవడుతూనే సాధ్యం అవుతుంది.. కానీ ఈ పాఠశాలలో పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి.. సుమారు 76 మంది విద్యార్థులు..కానీ ఉపాధ్యాయులు ఇద్దరే..ఈ ఇద్దరూ ఎంతమందిని అదుపులో పెట్టగలరు..? ఎలా క్రమశిక్షణ నేర్పగలరు..? ఎలా విద్య నేర్పగలరు..? వారందరినీ చూసుకోవడానికి సరిపోతుంది.. మరి వారి బాధ్యతలు ఎలా నిర్వర్తిస్తారు..? ఈ ప్రశ్నలకు ఎవరు సమాధానం చెబుతారు..? తీసుకుంటున్న జీతానికి సరైన న్యాయం చేయలేక..పాఠశాలను వదిలి వెళ్లలేక.. ఎవరికీ చెప్పుకోలేక ఆ ఇద్దరు ఉపాధ్యాయులు మదనపడుతున్నారు..తమలో తాము కృంగిపోతూ ఆవేదన చెందుతున్నారు.ఈ దుర్భర పరిస్థితులు యాదాద్రి భువనగిరి జిల్లా, పోచంపల్లి మండలం, ఎం.ఆర్.డీ. దేశముఖి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నెలకొంది.. అధికారులు తమ పని తాము కానిచ్చి చేతులు దులుపుకున్నారు..ఇప్పుడు 76 మంది విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.. విద్యా శాఖ నిర్లక్ష్యంతో చదువుల తల్లి చేష్టలుడిగి చూస్తోంది.. తమ పిల్లల భవిష్యత్తు ఏమిటో అర్థంకాక తల్లిదండ్రులు అలమటిస్తున్నారు.. తీసుకుంటున్న జీతానికి న్యాయం చేయలేక, విధులు సరిగా నిర్వర్తించలేక ఇద్దరు ఉపాధ్యాయులు తల్లడిల్లిపోతున్నారు..బడికి వస్తున్నామే గానీ, తాము ఏమి చేస్తున్నామో..? ఏమి చదువుతున్నామో..? భవిష్యత్తులు ఏమి చేయాలో అర్థం కానీ పరిస్థితుల్లో ఆ పసి హృదయాలు ఆట పాటలతో గడుపుతున్నారు..ఇంతటి దౌర్భాగ్యపు పరిస్థితి ఎందుకు నెలకొంది..? పాలకుల నిర్లక్ష్యం, విద్యాశాఖ అలక్ష్యం.. యాదాద్రి జిల్లా, పోచంపల్లి మండలంలోని ఎం.ఆర్.డీ. దేశ్ ముఖి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుండి 7 తరగతులు ఉన్నాయి. దాదాపు 76 మంది విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారు. 6గురు ఉపాధ్యాయులు ఎంతో బాధ్యతగా తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారు.. బాధ్యత కలిగిన భావిభారత పౌరులను తీర్చిదిద్దే పనిలో నిమగ్నమై వున్నారు.. ఈ విధంగా పాఠశాల చక్కగా నడుస్తున్న క్రమంలో ఒక ఆపద ఎదురైంది.. ఆగష్టు 26న జరిగిన ప్రమోషన్ల ప్రక్రియలో ఈ స్కూలనుండి 5 గురు ఉపాధ్యాయులను వివిధ పాఠశాలలకు ప్రమోషన్స్ పై బదిలీ చేయబడ్డారు.. ఇక మరొక ఉపాధ్యాయుడు ప్రమోషన్ పై ఈ స్కూల్ కి వచ్చారు..అయితే 7 తరగతులకు కలిపి ఈ ఇద్దరే ఉపాధ్యాయులు మిగిలిపోయారు. వీరిద్దరే ఇంతమందికి బోధన కొనసాగించవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో తమ పిల్లల భవిష్యత్ గురించి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై అధికారులను అడిగితే.. మండలం నుండి పంపడానికి ఏ పాఠశాలలోనూ ఎక్కువ ఉపాధ్యాయులు లేరని చేతులు ఎత్తేశారు. పిల్లలకు న్యాయం జరిగేది ఎలా ? భావిభారత పౌరుల భవితవ్యం ఏమిటి..? ఈ ఇద్దరు ఇంతమంది పిల్లలకు చదువులు నేర్పిస్తారా..? లేక వారందరినీ కంట్రోల్ చేయడానికే తమ సమయాన్ని కేటాయించాలా..? కనుక డీఈఓ తక్షణమే స్పందించి విద్యార్థులకు అవసరమైనంత మంది ఉపాధ్యాయులను కేటాయించి, పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయగలరని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు..

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.